www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 సోమవారం

# వెలుతురు

రంగారెడ్డి। 09, ఏప్రిల్ 2024 తెలుగు దిన పత్రిక

సంపుటి: 5 సంచిక: 320, పేజీలు: 12, వెల: రూ.5/-

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, ఏజెంట్లకు
వెలుతురు
శ్రీ క్రోధినామ
సంవత్సర శుభాకాంక్షలు.

ఉగాది పండుగ సందర్భంగా బుధవారం పత్రిక వెలువడదు. మళ్లీ గురువారం పునర్దర్శనం.

- ఎడిటర్

## అభివృద్ధి కోసం ఓటెయ్యండి

- మూడో సారి ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం చేస్తారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్8(వెలుతురు): జూన్ 8 లేదా 9న మూడో సారి ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. దేశం కోసం ఓటెయ్యండి.. అభివృద్ధి కోసం ఓటెయ్యండి అంటూ ప్రజలకు ఆయన సూచించారు. భారత దేశ గౌరవాన్ని పెంచడం కోసం ఓటెయ్యాలన్నారు. మోడీ ప్రధాని అయ్యేవరకు దేశం ఎలా ఉండేది.? ఆలోచించాలన్నారు. మోడీ వచ్చాక దేశం ఎలా అభివృద్ధి చెందిందో ఆలోచించాలని పేర్కొన్నారు. పదేళ్లకు ముందు దేశంలో ఉగ్రవాదం, మత కల్లోలాలు ఉండేవి..మేము వచ్చాక బుల్డోజర్ ప్రభుత్వం వచ్చిందన్నారు. దేశంలో ఎటువంటి మార్పులు వచ్చాయో చూడాలన్నారు. గతంలో కీలు బొమ్మలాంటి ప్రధాని ఉండేవారని.. మోడీ ప్రధాని మిగతా..2లో

## ఎంతమందిని జైల్లో పెడతారు?

- యూట్యూబ్‌లో విమర్శలుచేసే ప్రతీవ్యక్తినీ అరెస్టు చేస్తారా?
- స్టాలిన్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు మండిపాటు




న్యూఢిల్లీ,ఏప్రిల్8(వెలుతురు): సార్వత్రిక ఎన్నికల వేళ సోషల్ మీడియాలో రకరకాలైన విశ్లేషణలు వస్తుంటాయి. ఒక్కొక్కరు ఒక్కో పార్టీకి అనుకూలంగా మాట్లాడుతుంటారు. అయితే కొన్ని విశ్లేషణలు ఆయా పార్టీలకు నచ్చవు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటుంటాయి. మిగతా..2లో





## కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం...

- కొడంగల్‌పై కుట్రలు జరుగుతున్నాయి
- నన్ను కిందపడేయాలని చూస్తున్నారు
- కొడంగల్‌కు ఎవరూ చేయని అభివృద్ధి చేశా
- 4 వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టును తీసుకొచ్చా
- కొడంగల్ ను అభివృద్ధి చేయనీయొద్దని డీకే అరుణ కుట్ర
- అసలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఓడించాలి?
- ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా?
- రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చినందుకా?
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా?
- ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా?
- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- మండలాల వారీగా కాంగ్రెస్ నేతలతో సీఎం సమీక్ష
- భారీ మెజార్టీయే లక్ష్యంగా దిశానిర్దేశం

హైదరాబాద్,ఏప్రిల్8(వెలుతురు): కొడంగల్‌లో తనని కింద పడేయాలని కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని.. 75 ఏళ్లలో కొడంగల్‌కు ఎవరూ చేయని అభివృద్ధి చేశానన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కొడంగల్ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం సాయంత్రం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కొడంగల్‌కు తాను మెడికల్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్, వెటర్నరీ కాలేజ్ తీసుకొచ్చానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరువు ప్రాంతంగా ఉన్న కొడంగల్ ప్రాంతాన్ని 4 వేల కోట్ల రూపాయలతో నారాయణపేట్- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును తీసుకొచ్చానని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చారా అని బీజేపీ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను సీఎం ప్రశ్నించారు. కొడంగల్ ను అభివృద్ధి చేయనీయొద్దని డీకే అరుణ కుట్ర చేస్తున్నారన్నారు.“అసలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఓడించాలి. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా? రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చినందుకా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా? ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా?” అని సీఎం రేవంత్ రెడ్డి మిగతా..2లో

## సీఎం రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు



హైదరాబాద్, (వెలుతురు): రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుంచి శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ప్రజల ఆశలు ఆకాంక్షలన్నీ నెరవేరాలని ముఖ్య మంత్రి ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, రైతుల రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. నూతన సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటి చెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపు కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



## యువతకోసం కొత్త చట్టం..!

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- నిరుద్యోగ యువతకు రాహుల్ గాంధీ హామీ

సియోని,ఏప్రిల్8(వెలుతురు): ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల మహిళల మిగతా..2లో






# కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం...

మొదటిపేజీ తరువాయి..

ప్రశ్నించారు.పదేండ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్ లో ఏ ఒక్కరికైనా డబుల్ బెడ్రూం ఇచ్చిందా అని సీఎం ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని స్పష్టం చేశారు.ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు పెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారని.. పదేండ్లు ప్రధానిగా ఉన్న మోదీ ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. పదేండ్లు ప్రధానిగా ఉన్న మోదీ మళ్లీ ఓటేస్తే చంద్రమండలానికి రాజవుతారా అని మండిపడ్డారు.“మనల్ని దెబ్బ తీయడానికి పన్నాగాలు పన్నుతున్నారు. ఇది రేవంత్ రెడ్డిని దెబ్బతీయడం కాదు.. కొడంగల్ అభివృద్ధిని దెబ్బతీయడం. నేను ఎక్కడున్నా నా గుండె చప్పుడు కొడంగల్ మాత్రమే. కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం. నాతో కొట్లాడే హక్కు మీకుంది. పట్టు పట్టి పని చేయించుకునే అధికారం మీకుంది. రాష్ట్రానికే నాయకత్వం వహించే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్ నుంచి 50వేల మెజారిటీ అందించాలి. కొడంగల్ పై జరిగే కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలి.” అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌ను 14 సీట్లలో గెలిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అందుకు తగ్గట్టుగానే వ్యూహాత్మకంగా ముందుకు




సాగుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీ నేతలకు, శ్రేణులకు కీలక సూచనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటుపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ మహబూబ్‌నగర్ పరిధిలోనే ఉండటంతో.. కొడంగల్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ తీసుకురావడంపై దృష్టి సారించారు. సోమవారం (ఏప్రిల్ 8) మండలాలవారీగా కాంగ్రెస్ నేతలతో సమీక్ష నిర్వహిస్తున్నారు. నేతలకు, కార్యకర్తలకు ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఇక బీజేపీ తరపున మాజీమంత్రి డీకే అరుణ బరిలో ఉన్నారు. కచ్చితంగా ఈసారి ఎంపీగా గెలవాలని భావిస్తున్న డీకే అరుణ.. ఇందుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ తరపున సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి మరోసారి ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. మూడు పార్టీలకు మహబూబ్‌నగర్‌లో పట్టు ఉండటంతో.. ఇక్కడ త్రిముఖ పోటీ ఉండొచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ భారీ మెజార్టీ సాధించడంపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి పెట్టారు.

# బయటపడుతున్న కీలక ఆధారాలు

## ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ ట్యాపింగ్ కలకలం

**నల్లగొండ,ఏప్రిల్8(వెలుతురు):** సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పోలీసుల పాత్ర ఒక్కోటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రౌడీ షీటర్లతో కలిసి సెటిల్‌మెంట్లు, గంజాయి కేసు నిందితులు, పేకాట నిర్వాహకులు, ఇతర నేరస్థులను టార్గెట్ చేసి రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలింది.రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల సమయంలో జిల్లాకు చెందిన నేతల కదలికలను పసిగట్టేందుకు నల్లగొండలోనే వార్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నలుగురు అధికారులు గతంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పనిచేసిన వారే. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు 2015లో నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు నల్లగొండలో ఓఎస్డిగా పని చేశారు. ఏఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులు కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. డిఎస్పి ప్రణీత్ రావు.. ఎస్పైగా జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. సీఐ గట్టు మల్లు కూడా నల్గొండ జిల్లాలో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన సమయంలోనే వీరితో సన్నిహితంగా మెలిగిన టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్లను వార్ రూమ్ లో వీరికి కీలక భాద్యతలు అప్పగించారు.విపక్ష నేతల ఫోన్లతోపాటు రైస్ మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపారులు, ఇతర పరిశ్రమల యజమానుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లుగా దర్యాప్తు బృందం గుర్తించింది.

వార్ రూమ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపార్లను బెదిరించి ఈ కానిస్టేబుళ్లు భారీ అక్రమాలకు పాల్పడ్డారట. అక్రమ దందాలు చేసే రైస్ మిల్లర్ల నుంచి నెలవారీ మామూళ్లు, పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి వసూళ్లు చేసేవారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని ముఖ్యమైన పట్టణానికి చెందిన రౌడీ షీటర్ తో కలిసి ఓ కానిస్టేబుల్ భూ దందాలు, సీటిల్మెంట్లు చేసినట్లు అధికారులు నిర్ధారించారు.ట్యాపింగ్‌ను అడ్డుపెట్టుకొని ఈ కానిస్టేబుళ్లు.. ఓవైపు రాజకీయ నేతలకు అవసరమైన ఫోన్లతో పాటు, మరోవైపు సొంత



వ్యవహారాలకు కూడా వినియోగించినట్లు తెలుస్తోంది. వార్ రూమ్ సమాచారాన్ని అడ్డుగా పెట్టుకొని టాస్క్ ఫోర్స్ పోలీసులు.. కొందరు మహిళల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళల ఫోన్లను ట్యాప్ చేసి వ్యక్తిగత సంభాషణలు విని లోబర్చుకునేవారని అధికారుల దర్యాప్తులో తేలింది. తాము కన్నేసిన మహిళలు, ఉద్యోగినుల వ్యక్తిగత జీవితాలను సైతం సదరు కానిస్టేబుళు టార్గెట్ చేశారట. నల్లగొండ వార్ రూమ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 40 మంది మహిళలను లైంగికంగా వేధించారు. నల్లగొండ వార్ రూమ్?లో కీలకంగా పని చేసిన సదరు కానిస్టేబుల్.. అక్రమ కేసులో ఓ చోట నాయకుడు అరెస్టయితే దానిని అడ్డుపెట్టుకుని ఆయన కుటుంబ సభ్యులను సదరు కానిస్టేబుల్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వార్ రూమ్ లో పని చేసిన కానిస్టేబుళ్లు నిర్వాకాన్ని బయటకు చెబితే పరువుపోతుందని మహిళలు అప్పట్లో బాధిత మహిళలు ముందుకు రాలేదు. ఇపుడు బాధితుల్లో కొందరు త్వరలో బయటకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ట్యాపింగ్ బృందంలో పని చేసిన కానిస్టేబుళ్లు వ్యవహారంలో కొత్త కోణాలు వెలుగు చూస్తుండడంతో పోలీసు శాఖ, రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది.

# కాళేశ్వరం పేరుతో దోచుకున్నారు

## రైతులను రెచ్చగొట్టే పనిలో బిఆర్ఎస్

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం,ఏప్రిల్8(వెలుతురు):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ మే ధ్యేయంగా పనిచేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ విషయంలో బిఆర్ఎస్ దొంగ ఏడ్పులు ఏడ్వాల్సిన అవసరం లేదన్నారు. కరువుకు తామే కారణమంటూ చెప్పడం సిగ్గుచేటన్నారు. సోమవారం వైరా నియోజకవర్గ కేంద్రంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్నదని.. ఆ పరిస్థితుల్లో నీటిని మొత్తం వేస్ట్‌గా దిగువ ప్రాంతాలకు వదిలారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే నీటి కొరత ఏర్పడిందని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతులను రెచ్చగొట్టేందుకు సానుభూతి పొందేందుకు



కేసీఆర్ నటిస్తున్నారని.. రైతాంగం అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.సాగర్ జలాలతో ఈ ప్రాంత చెరువులు, కుంటలను నింపి త్రాగునీటి ఇబ్బందులను తొలగిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాల పరిపాలనలో రాష్ట్రం తీవ్రంగా దెబ్బ తిన్నదన్నారు. బీఆర్ఎస్ నాయకులు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని.. ఇది ఎప్పటికీ జరగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పేదల పక్షపాతి అని.. వారి సంక్షేమం కోసం ఎన్ని విధాలైనా కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడుతుందని వెల్లడించారు. వేసవికాలంలో వర్షాలు పడటం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుపిస్తున్నారన్నారు. వర్షాలు అనేవి ఎన్నికల కంటే ముందే వచ్చాయని.. వచ్చిన నీటిని ఆ ప్రభుత్వమే నదులు పాలు చేసిందని మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.




# యువతకోసం కొత్త చట్టం..!

**మొదటిపేజీ తరువాయి..**

ఖాతాల్లోకి ఏటా లక్ష రూపాయలను జమ చేస్తుందని రాహుల్ గాంధీ తెలిపారు. ఇదిలా ఉంటే.. లోక్ సభ ఎన్నికల్లో మండల స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తేపై కాంగ్రెస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఓంకార్‌సింగ్ మార్కమ్‌ను బరిలోకి దింపింది. ఈ క్రమంలో.. సియోని జిల్లాలోని ధనోరాలో రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు గ్యారెంటీ అప్రెంటీస్‌షిప్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. తమ మేనిఫెస్టోలో మూడు నాలుగు విప్లవాత్మకమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు, వెనుకబడిన తరగతులు, పేద కుటుంబాలకు చెందిన మహిళల బ్యాంకు ఖాతాలకు లక్ష రూపాయలను బదిలీ చేయడం వంటివి. ఈ విధంగా తాము ప్రతి నెలా మీ ఖాతాలకు వేల రూపాయలు పంపుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా.. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు చెల్లించే మొత్తాన్ని రెట్టింపు చేస్తామని మేనిఫెస్టోలో ఉంచామని రాహుల్ గాంధీ చెప్పారు.నిరుద్యోగ యువతకు రాహుల్ గాంధీ హామీల వర్షం కురిపించారు. దేశంలోని ప్రతి నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగంలో ఒక సంవత్సరం అప్రెంటిస్‌షిప్ పొందేలా తాము కొత్త చట్టాన్ని కూడా తీసుకువస్తామని తెలిపారు. ఆ సమయంలో వారికి జీతభత్యం అందిస్తామన్నారు. శిక్షణ పూర్తయ్యాక మంచి పనితీరు కనబరిస్తే అదే చోట ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. మరోవైపు.. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఉద్యోగాల్లో కాంట్రాక్టు వ్యవస్థకు స్వస్తి పలికి, ప్రభుత్వ రంగంలోని 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అంతేకాకుండా.. రైతులు తమ పంటలకు సరిపడా ఎంఎస్‌పి వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేస్తుందని, దీని కోసం వారు చాలా కాలంగా ఉద్యమిస్తున్నారని గుర్తు చేశారు. మరోవైపు.. ఆదివాసీలను తమ భూమి నుంచి నిర్మూలించి.. నీరు, అడవి, భూమిపై వారి మొదటి హక్కులను లాగేసుకోవడమే లక్ష్యంగా బీజేపీ ఉద్దేశపూర్వకంగా వారిని ‘ఆదివాసీలు’ అని కాకుండా ‘అటవీవాసులు’ అని పిలుస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# ఎంతమందిని జైల్లో పెడతారు?

**మొదటిపేజీ తరువాయి..**

తమిళనాడు రాష్ట్రంలో చోటుచేసుకున్న ఘటనపై తాజాగా దేశ సర్వోన్నత న్యాయస్థానం అగ్రహం వ్యక్తం చేసింది. యూట్యూబ్‌లో విమర్శలు చేసే ప్రతీ వ్యక్తినీ అరెస్టు చేసుకుంటూ పోతే.. ఎన్నికల ముందు ఎంతమందిని జైల్లో పెడతారు? అంటూ స్టాలిన్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు మండిపడింది. సోషల్ మీడియాలో విమర్శలు చేసే ప్రతి ఒక్కరినీ జైలుకు పంపడం సరికాదని జస్టిస్‌లు అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో తమిళనాడుకు చెందిన యూట్యూబర్ దురై మురుగన్‌ను 2021 అక్టోబరులో పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత అతడికి బెయిల్ మంజూరైంది. అయితే న్యాయస్థానం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేశాడన్న కారణంతో 2022లో మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ అతడి బెయిల్‌ను రద్దు చేసింది. దీంతో మురుగన్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. మధ్యంతర బెయిల్ లభించింది. అప్పటి నుంచి అతడు బయటే ఉంటున్నాడు.ఈ క్రమంలోనే రెగ్యులర్ బెయిల్ రద్దును సవాల్ చేస్తూ యూట్యూబర్ దురై మురుగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తాజాగా విచారణ జరిపింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. యూట్యూబ్‌లో విమర్శలు చేసిన ప్రతిఒక్కరినీ అరెస్టు చేసుకుంటూపోతే.. ఎన్నికల ముందు ఎంతమందిని జైల్లో పెడతారు? అని ప్రశ్నించింది. కోర్టు ఇచ్చిన స్వేచ్ఛను అతడు దుర్వినియోగం చేసినట్లు ఎలాంటి సాక్ష్యాలు లేవని పేర్కొంది. దీంతో అతడి రెగ్యులర్ బెయిల్‌ను పునరుద్ధరిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. సార్వత్రిక ఎన్నికల ముందు సోషల్ మీడియాలో కామెంట్లు చేసేవారికి ఈ తీర్పు ఓ బూస్ట్‌లాంటింది. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఆయా పార్టీలకు అనుకూలంగా యూట్యూబర్లు వీడియోలు పెడుతున్నారు. రోజు కొన్ని వందల వీడియోల్లో అప్‌లోడ్ అవుతున్నాయి. చాలా మట్టుకు ఆయా పార్టీలకు సంబంధించిన వీడియోలే ఎక్కువగా ఉంటున్నాయి. ఇక తాజా తీర్పు యూట్యూబర్లకు మాత్రం సానుకూలమైన జడ్జిమెంట్ వచ్చింది. ఇక దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. తొలి విడత ఏప్రిల్ 19న ప్రారంభం అవుతోంది. సెకండ్ విడత ఏప్రిల్ 26, మే 7, 13, 20, 25, జూన్ 1న పోలింగ్ జరగనుంది. ఇక ఫలితాలు జూన్ 4న విడుదల కానున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. మరికొన్ని స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించాల్సి ఉంది. ఇక విజయంపై ఆయా పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# అభివృద్ధి కోసం ఓటెయ్యండి

**మొదటిపేజీ తరువాయి..**

అయ్యాక ప్రపంచలో నంబర్ వన్‌గా అయ్యామన్నారు. పదేళ్లకు ముందు అన్ని వస్తువులు విదేశాల నుంచి వచ్చేవని.. మోడీ వచ్చాక చిన్న పిల్లల బొమ్మల నుంచి చంద్రయాన్ వరకు మనమే తయారు చేస్తున్నామన్నారు. రక్షణ శాఖ ఉత్పత్తులను ప్రపంచానికి ఎగుమతి చేస్తున్నామన్నారు. మన్మోహన్ సింగ్ పదేళ్లు పరిపాలించారని.. కాంగ్రెస్ హయాంలో పదిహేను రోజులకో కుంభకోణం జరిగేదని విమర్శించారు. వందల, వేల కోట్ల రూపాయలను కాంగ్రెస్ హయాంలో దోపిడీ చేశారని ఆరోపించారు. బీజేపీ పాలనలో ఒక్క రూపాయి దుర్వినియోగం చేయలేదన్నారు.బీజేపీ పుట్టిందే ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా అంటూ ఆయన తెలిపారు. బీజేపీ చేసిన అభివృద్ధికి.. కాంగ్రెస్ చేసిన అభివృద్ధికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370తొలగిస్తామని చెప్పాం.. చేశామన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో జిన్నా రాజ్యాంగాన్ని తొలగించి.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని తెచ్చామన్నారు. మళ్లీ జిన్నా రాజ్యాంగాన్ని తెస్తామని రాహుల్ గాంధీ చెప్తున్నాడని విమర్శించారు. లవ్ జీహాదిని చట్టపరం చేస్తామని చెప్తున్నారని ఆయన పేర్కొన్నారు. మీ ప్రభుత్వంలో.. పోలీస్ శాఖలో లవ్ జీహాదిని కాపాడే విభాగాన్ని ఏర్పాటు చేశారా అంటూ రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. తలాక్ తలాక్ తీసేసి ముస్లిం ఆడబిడ్డలను రక్షించామన్నారు. చట్టం రద్దుకు ముస్లింలు స్వాగతం పలికారన్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టో హిందూ వ్యతిరేక మేనిఫెస్టో. స్వాత్యంత్రం రాకముందు ఉన్న ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీ ఉంది. జీఎస్టీని రద్దు చేస్తాం.. కుంభకోణాలను ఎంకరేజ్ చేస్తాం అంటున్నారు. తెలంగాణకు అనేక హామీలని తుక్కుగూడ నుంచి రాహుల్ ఇచ్చారు. రాష్ట్రానికి మీరిచ్చిన గ్యారెంటీలు ఎంత వరకు అమలు చేశారు.. చెప్పండి.? రుణమాఫీ ఎంత వరకు చేశారు.? రేవంత్ రెడ్డి ఒక మాట ముందుకు వచ్చి చెప్పాడు. డిసెంబర్ లో రుణమాఫీ చేస్తామని చెప్పాడు. నిధులు ఎక్కడ నుంచి తెస్తావు రేవంత్ రెడ్డి చెప్పాలి.? ఎకరానికి 15వేలు ఎక్కడికి పోయినయ్.? మీ గ్యారంటీలు ఎక్కడికి పోయినయ్.? బస్సులల్ల తిరిగితే అన్నీ ఇచ్చాం అనుకోండి అంటున్నారు. ఆర్టికల్ 370 రద్దు చేస్తామని చెప్పారు.. చేశాం.. ఇది మోడీ గ్యారెంటీ. అనేక పోరాటాల తరువాత అయోధ్యలో రామ మందిరాన్ని కట్టుకున్నాం.. మోడీ హయాంలో రామ మందిరం పూర్తయ్యింది.. కాంగ్రెస్ పార్టీ సెక్యులరిజం పేరుతో హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేశారు.. దేవాలయాన్ని ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ కూర్చుంది.. అయోధ్య ఆలయాన్ని జవహర్ లాల్ నెహ్రూ అడ్డుకున్నాడు.. వల్లభాయ్ పటేల్ అయోధ్యను కాపాడుదాం అంటే నెహ్రూ ఆపాడు.” అని కిషన్ రెడ్డి తెలిపారు.

# పక్షులు అంతరించిపోతున్నాయి

## వాతావరణం, జీవావరణం మధ్య సమతుల్యత పాటించాలి

## వాతావరణ మార్పులపై సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ,ఏప్రిల్8(వెలుతురు):** వాతావరణ మార్పుల హెచ్చరికలను ప్రపంచం గుర్తించింది. 2070 నాటికి ‘జీరో ఎమిషన్స్’ సాధించాలనే భారత్ అంతర్జాతీయ నిబద్ధతకు మద్దతు లభించింది. ఇదిలా ఉండగా.. వాతావరణం, జీవావరణం మధ్య సమతుల్యతను పాటించాలని సుప్రీంకోర్టు మొదటిసారిగా ఆదేశాలు ఇచ్చింది. బొగ్గు, గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి మారడం, దాదాపు అంతరించిపోయిన గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షిని రక్షించడం వంటి వాటిని ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు సమతుల్యతను పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షిని గోదావన్ అని కూడా పిలుస్తారు, ఇది రాజస్థాన్‌లో కనిపిస్తుంది. 2019 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయమూర్తులు రద్దు చేశారు. ఆ ఉత్తర్వు.. రాజస్థాన్, గుజరాత్‌లలో 90,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విద్యుత్ ప్రసార మార్గాలను నిషేధించింది. సౌర విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తుంది. 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 450 గిగావాట్లకు పెంచాలనే భారతదేశ లక్ష్యాన్ని ప్రమాదంలో పడేస్తుంది. ఇప్పుడు గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షి యొక్క 13,000 చదరపు కిలోమీటర్ల కోర్ ఆవాసాన్ని మినహాయించి, 77,000 చదరపు కిలోమీటర్లలో విద్యుత్ ప్రసార మార్గాలపై నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసింది. ఈ కేసు నిర్ణయాన్ని ఆదివారం అప్‌లోడ్ చేసింది. దీని ప్రకారం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పెంచడం, పక్షులను రక్షించడం మధ్య సమతుల్యతను సాధించడంపై దృష్టి కేంద్రీకరించబడింది. విద్యుత్ తీగలు ఢీకొని చాలా పక్షులు చనిపోతాయని, అందుకే పర్యావరణవేత్త ఎం.కె. రంజిత్ సింగ్ వాదనల ఆధారంగా హై ఓల్టేజీ వైర్లపై నిషేధం విధించారు. ఈ అంశాన్ని క్షుణ్ణంగా విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఏడుగురు సభ్యులతో కూడిన కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తన నివేదికను జులై 31లోగా ప్రభుత్వం ద్వారా కోర్టుకు సమర్పించనుంది. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలను బెంచ్ అంగీకరిస్తూ.. ‘పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే భారత్ నిబద్ధత, ముఖ్యంగా గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగానే ఉంది. ‘ ఈ ఆదేశాలు ఇచ్చింది.



### ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో

# ఆర్య వైశ్య అమావాస్య అన్నదానం

**గంప లక్ష్మయ్య - రత్నమ్మ, పెంటయ్య - అన్నపూర్ణల జ్ఞాపకార్థం**

**అన్నదాత గంప అనురాధ - చంద్రశేఖర్, నాగరాజు**

**తూప్రాన్ వెలుతురు ఏప్రిల్ 08:**
తూప్రాన్ పట్టణంలోని సుభాస్ చంద్రబోస్ విగ్రహం వద్ద సోమవారం మధ్యాహ్నం ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్వర్యంలో ఆర్యవైశ్య అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం తాత నానమ్మ గంప లక్ష్మయ్య - రత్నమ్మ, నాన అమ్మ గంప పెంటయ్య - అన్నపూర్ణ ల జ్ఞాప కార్థం గంప అనురాధ - చంద్రశేఖర్ గుప్త, నాగరాజు గుప్త ల అధ్వ ర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్ రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కోడిప్యాక నారాయణ గుప్త మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్న దానం గొప్పదని ఇంకా అమావాస్య నాడు అన్న దానం చేయడం వల్ల పుణ్యం పురుషార్థం రెండు లభిస్తాయని తెలిపారు. మానవసేవే మాధవ సేవ అని తాను సంపాదించిన సొమ్ము నుండి కొంత ఇతరులకు దానం చేయడం వల్ల పుణ్యం మనతో పాటు మన పిల్లలకు మంచి జరుగుతుందని అన్నారు.

ఈ అమావాస్య అన్నదానం కార్యక్రమంలో ఐవిఎఫ్ రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కోడిప్యాక నారాయణ గుప్త, వైస్ చైర్మన్ నందల శ్రీనివాస్, కౌన్సిలర్ లు రవీందర్ రెడ్డి, పల్లెర్ల రవీందర్ గుప్త, కుమ్మరి రఘుపతి, జమాల్ పూర్ నర్సోజీ, కాంగ్రెస్ నాయకులు మామిండ్ల కృష్ణ ముదిరాజు, రామునిగారి చిన్న నాగరాజుగౌడ్, ఎం.డి ఉమర్ భాయ్, సూర్య చంద్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఎక్కల్ దేవ్ వెంకటేష్ యాదవ్, ఆర్య వైశ్య సంఘం నాయకులు కోవురి శ్రీనివాస్ గుప్త, కోడిప్యాక నాగరాజుగుప్త, కోడిప్యాక చిన్న నారాయణ గుప్త, కోడిప్యాక లక్ష్మన్ రావుగుప్త, గంప రఘుపతి గుప్త, దొంతి శ్రీనివాస్ గుప్త, మాలె కుమార్ గుప్త, మన్నెం ప్రభాకర్ గుప్త, చంద నారాయణ గుప్త, గట్టు కుమార్ గుప్త, గోపారం రమేష్ గుప్త, కమటాల బద్రి గుప్త, కోడిప్యాక టక్కయ్య గుప్త, గబ్బుల సిద్ధిరాములు గుప్త, గంప బిక్షపతి గుప్త, కొండ శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు. సుమారు 5 వందల మంది కి అన్నదానం చేశారు.

# ప్రెస్ క్లబ్‌కు శాశ్వత భవనాన్ని నిర్మిస్తాం

**-మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్,08:**
ప్రెస్ క్లబ్ హైదరాబాద్ కు అన్ని హంగులతో అద్భుత భవనాన్ని నిర్మించి ఇస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వానికి



జర్నలిస్టులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తాము ఈ ఏడాది చివరి నాటికే కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. రూ.20 కోట్లు ఖర్చు అయినా సరే పాత్రికేయుల కోసం అన్ని హంగులతో కూడిన భవనాన్ని నిర్మించి ఇస్తామని ఆయన వెల్లడించారు. ప్రజల పక్షాన పని చేసే జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రస్తుతం ప్రెస్ క్లబ్ లో మహిళల సౌకర్యం కోసం నిర్మిస్తున్న భవనానికి తన స్వచ్ఛంద సంస్థ అయిన ప్రతీక్ ఫౌండేషన్ నుంచి

5 లక్షల నగదు సహాయం అందిస్తాననీ మంత్రి వెల్లడించారు. అనంతరం ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల నాయుడు, ప్రధాన కార్యదర్శి రవికాంత్ రెడ్డి తో పాటు కార్యవర్గ సభ్యులతో కలిసి క్లబ్ ను పరిశీలించారు. గత దశాబ్ద కాలంగా ప్రెస్ క్లబ్ లో పెండింగ్ లో ఉన్న ప్రెస్ క్లబ్ భవన్ నిర్మాణం గురించి జర్నలిస్ట్ లు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన మంత్రి.. క్లబ్ కార్యవర్గం తో చర్చించి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి తో సమావేశం నిర్వహించి జీ ఒ4 గా ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కావాల్సిన బడ్జెట్ ను మంజూరు చేసి అద్భుతమైన ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం లోనే ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేశామని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అద్భుతమైన ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు.మంత్రి గారి స్పందన పట్ల జర్నలిస్ట్ లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి దానం నాగేందర్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల నాయుడు, రవి





కాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రావు, సి వనజ, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరి ప్రసాద్, కోశాధికారి రాజేష్, ఈసీ మెంబర్లు శ్రీనివాస్, వసంత్ కుమార్, బి.గోపరాజు, సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్, యూసుఫ్ బాబు, ఆజం ఖాన్ తదితరులు హాజరయ్యారు. ముస్లిం మతగురువు సయ్యద్ షా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



# నా ఆరోగ్యం నా హక్కు..

**డాక్టర్ జే వెంకటి**

**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి హైదరాబాద్**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 08:**
ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జే వెంకటి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యసంస్థ ఆరోగ్యం అనే పదానికి వ్యాధి, అంగ



వైకల్యం లేకపోవడమే కాకుండా సంపూర్ణ శారీరక, మానసిక, సామాజిక స్వస్థతను కలిగి ఉండే స్థితిగా నిర్వచించిందని పేర్కొన్నారు. ఈ సంవత్సరపు నినాదం నా ఆరోగ్యం - నా హక్కుని గురించి చర్చించే ముందు ప్రపంచ ఆరోగ్య సంస్థ తీసుకున్న ఈ అద్భుత నిర్ణయం గురించి తెలుసుకోవాలి. అదే 1978 అల్మా - ఆటా 2000 సం నాటికి అందరికి ఆరోగ్యం అనే ఈ డిక్లరేషన్ ప్రజారోగ్య తీరుతెన్నులను మార్చింది. వ్యాధి చికిత్స నుండి నివారణకు, నివారణ నుండి సంపూర్ణ స్వస్థత వైపు ప్రపంచ ఆరోగ్యరంగాన్ని



చూసేలా చేసింది. ఇందులో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ భావనలను విశదీకరించిందని అన్నారు. ప్రతీ మానవునికి మంచి ఆరోగ్యం పొందే హక్కు ఉందని, మనిషికి కావలసిన కనీస ఆరోగ్య అవసరాలయిన స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, పోషకాలతో కూడిన ఆహారాన్ని, ఈ యుద్ధాలు, విధ్వంసం, శిలాజ ఇంధన వినియోగం, అవసరాన్ని మించిన ఎరువుల విని యోగం ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నాయి. ఈ ఆరోగ్య హక్కుకు భం గం కలిగించే ప్రత్యక్ష, పరోక్ష కారకాల నుండి మానవుడికి స్వేచ్ఛ లభిం చినప్పుడే అతడికి ఆరోగ్యహక్కు సాకారమవుతుంద ని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో డి ఐ ఓ డాక్టర్ శ్రీ కళ, ఎస్బిహెచ్వోలు, మాస్ మీడియా అధికారి రాములు, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం..

## క్రోధినామ ఉగాదికి ఆహ్వానం!

ఉగాది అంటే యుగారంభమని పురాణ ప్రవచనం. మనకు కొత్త వసత్సరం ఉగాదితోనే ప్రారంభం అవుతుంది. వస్తం మొదలవుతుంది. .పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు ఇదే రోజున విశ్వాన్ని సృష్టించాడని పురాణోక్తి. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణైతికంగా చెప్పబడింది. వేదాలను హరించిన సోమకుని వధించి మత్స్యవతారి యైన విష్ణువు వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభతరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందన్న పురాణ ప్రచారం కూడా ఉంది. చైత్రశుక్ల పాడ్యమినాడు విశాలవిశ్వాన్ని బ్రహ్మదేవుడు సృష్టించాడు కనుక సృష్టి ఆరంభించిన సంకేతంగా ఉగాది జరుపబడు తుందని కూడా చెప్పబడుతుంది. ఈ యేడు క్రోధి నామ సవంత్సరం. మొత్తంగా 60 వసంతాలు ఉంటాయి. ప్రభవతో మొదలై 60 ఏళ్ల తరవాత మళ్లీ ప్రభవ వస్తుంది. ప్రస్తుతం మనం క్రోధినామం లోకి ప్రవేశిస్తున్నాం. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగిలించి మానవాళిలో నూతనాశయాలను అంకురింప చేసే శుభదినం ఉగాది. శిశిర ఋతువు ఆకురాలు కాలం. శిశిరం తరువాత వసంతం వస్తుంది. చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయమానంగా వుంటుంది. కోయిలలు కుహూకుహూ అని పాడుతాయి. ఉగాది రోజు నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున కొత్తగా పనులు ప్రారంభించుట పరిపాటి. అయితే ద్వాదశ రాసులు ఎలా ఉన్నా ఉగాది నుంచి అంతా మంచే జరుగాలని కోరుకుందాం. కొత్త సంవత్సరంలో వస్తున్న ఈ ఎన్నికల్లో ప్రజలు గెలవాలని ఆకాంక్షిద్దాం. చైత్ర శుక్ల పాడ్యమి రోజున బ్రహ్మదేవుడు తన సృష్టి ముగించాడనీ, అదే యుగారంభమనీ చెబుతారు. అయితే, ఆ రోజునే సృష్టి ప్రారంభమయిందనీ అందుకే ఆ రోజు యుగాదిగా పరిగణన పొందిందనీ అంటారు. ఉగస్య ఆది అనేదే ఉగాది. ఉగ అనగా నక్షత్ర గమనం. జన్మ ఆయుష్షు అని అర్థాలు. వీటికి 'ఆది' అనగా మొదలు ఉగాది. అనగా ప్రపంచం జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయింది. ఇంకొకవిధంగా చెప్పాలంటే, 'యుగం' అనగా రెండు లేక జంట అని కూడా అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే ఆయన ద్వయ సంయుతం యుగం సంవత్సరం కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయింది. అదే సంవత్సరాది. ఉగాది వసంతాలకు గల అవినాభావ సంబంధం, సూర్యునికి సకల ఋతువులకు ప్రాతః సాయం కాలాది త్రికాలములకు ఉషాదేవతయే మాతృస్వరూపం. శాలివాహన చక్రవర్తి చైత్రశుక్లపాడ్యమి నాడే పట్టాభి షిక్తుడై తన శౌర్యపరాక్రమాలతో శాలివాహన యుగకర్తగా భాసిల్లిన కారణాన ఆ యోధాగ్రని స్మృత్యర్థం ఉగాది ఆచరింపబడుతుందని చారిత్రక వృత్తాంతం. ఆ రోజున ప్రాతః కాలమున లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్ర పరచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంక రిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైంది. షడ్రుచుల సమ్మేళనం. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది.. క్రోధి నామ సంవత్సరం మంగళవారం నాడు వస్తోంది. కాబట్టి రాజు కేతువుగా పరిగణించాలి. సూర్యుడు మేషరాశిలోకి సంక్రమించే వారాన్ని బట్టి మంత్రిని, సింహరాశిలోకి ప్రవేశించే వారం ఆధారంగా సేనాధిపతిని, కర్కాటక సంక్రమణం చేసే వారాన్ని బట్టి సస్యాధిపతిని, ధనూరాశిలోకి వచ్చే వారం ఆధారంగా ధాన్యాధిపతిని, మిథున సంక్రమణ జరిగే వారాధిపతిని అర్ఘాధిపతిగా, తులలో ప్రవేశించే రోజును బట్టి రసాధిపతిని, మకరరాశిలో ప్రవేశించే వారం ఆధారంగా నీరసాధిపతిని.. ఇలా నవ నాయకులను నిర్ణయిస్తారు. సూర్యుడు.. ఆరుద్ర నక్షత్రంలోకి ప్రవేశించే వారం అధిపతి ఆధారంగా మేఘాధిపతిని నిర్ణయిస్తారు. నవనాయకులను బట్టి.. సంవత్సర ఫలితాలను పంచాగకర్తలు అంచనా వేస్తారు. సంవత్సరాది ఏ వారం వస్తుందో.. ఆ వారానికి అధిపతిని రాజుగా నిర్ణయిస్తారు. రాజు, మంత్రి, సేనాధిపతి పరిపాలనను నిర్ణయిస్తారు. సస్యాధిపతిని బట్టి వర్షపాతం, ధాన్యాధిపతిని బట్టి ధాన్యవృద్ధి, అర్ఘాధిపతిని ఆధారంగా నవ్వులు, మినుములు మొదలైన వాటి దిగుబడి, మేఘాధిపతి ఆధారంగా వర్షాలు, పంటలు ధరలు, రసాధిపతిని బట్టి పులుపు, చేదు మొదలైన పదార్థాల ధరల హెచ్చుతగ్గులు నిర్ణయిస్తారు. ఉగాది అంటేనే రానున్నకాలానికి విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. కాలచక్ర పరిభ్రమణం ఆధారంగా నవనాయకుల నిర్ణయం జరుగుతుంది. ఆ విశేషాలను జ్యోతిషశాస్త్రం తెలియ జేస్తుంది. ప్రతి సంవత్సరానికీ రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధిపతి, ధాన్యాధిపతి, అర్ఘ్యాధిపతి, మేఘాధి పతి, రసాధిపతి, నీరసాధిపతి అని తొమ్మిదిమంది నాయకులు ఉంటారు. వీరినే నవనాయకులు అంటారు. ఇక ఇళ్లలో కూడా పంచాంగానికి పూజలు చేయడం కూడా ఆనవాయితీగానే వస్తోంది. చంద్రుడి నక్షత్ర యోగాన్ని అనుసరించి చాంద్రమానం, సూర్య సంక్రమణాల ప్రకారం సౌరమానం, గురూదయాన్ని ఆధారంగా చేసుకొని బార్హస్పత్య మానం లెక్కిస్తారు. ఎవరి పరంపరాగతమైన, ప్రాంతాను సౌర మానాలు వారికి ప్రమాణాలు. ఇందులో వైరుధ్యాలేమీ లేవు. గణనలో విభిన్నత్వం ఉన్నా ఫలాల్లో, పంచాంగాల పద్ధతుల్లో పెద్దగా భేదమేదీ ఉండదు. ఈ పండగ రోజంతా కొత్త వాతావరణం స్ఫురిస్తూ ఉంటుంది. నూతనశోభ సర్వత్రా వెల్లి విరుస్తుంది. ప్రకృతిలోని చెట్టు, పుట్ట అంతా ఆనంద మయంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. అలాంటి శుభవేళ మానవాళి అంతా ప్రకృతి పులకింతకు అనుగుణంగా మధురానుభూతులను పరస్పరం పంచుకోవాలన్న ఓ మహత్తర సమసమాజ స్థాపన లక్ష్యం ఉగాది పండగ వెనుక దాగి ఉంది.

## "2024 పార్లమెంట్ ఎన్నికలు - సామాజిక శక్తుల కర్తవ్యం"

మే13నతెలంగాణలోని 17 లోకసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాబోయే ఐదేళ్ల దేశ ప్రజల భవిష్యత్తు నిర్దేశిస్తాయి అట్టడుగు ప్రజలైన దళితులుకు రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజం లౌకిక తత్వం వంటి రాజ్యాంగ మూల స్తంభాలు మిగిలి ఉంటాయా? లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

10 ఏళ్ల బీజేపీ పరిపాలనలో దళితులపై, మహిళలపైన తీవ్రస్థాయిలో దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలలో 300 రెట్లు దళితులపై దాడులు పెరిగినాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ బిజెపి అధికారంలో ఉంది. దళిత యువతి మనిషా వాల్మీకి నలుగురు బ్రాహ్మణ రాజపుట్ కులాలకు చెందిన యువకులు కూలి పనికి వెళ్లిన ఆమెపై నాలుగు గంటల పాటు గ్యాంగ్ రేప్ పాల్పడ్డారు. ఆమె నాలుక కోసి, నడుములు విరిచారు హాస్పటల్ 14రోజులతర్వాత చనిపోతే కనీసం శవాన్నికూడా ఇవ్వకుండా అవమానీయంగా ప్రవర్తించింది బిజెపి యోగి సర్కార్. గ్యాంగ్ రేప్ కు పాల్పడిన ఆ రేపిస్టులకు బిజెపి అండగా నిలబడింది. గంగా నదిలో ఓ దళిత మహిళా స్నానం చేసేందుకు వెళ్లినందుకు ఆమెను నగ్నంగా చితకబాది జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. మణిపూర్ లో ఇద్దరు ఆదివాసి మహిళలను నగ్నంగా ఊరేగింపు చేసిన సంగతి దేశం మొత్తం కనులారా చూసింది. అక్కడ ఉంది కూడా బీజేపీ సర్కారే. మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ ఊహనా పట్టణంలో ఐదుగురు దళిత యువకులను పశు మాంసం తెస్తున్నారని నెపంతో చెట్టు కట్టేసి కొట్టి కారుకు కట్టేసి ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. 30 ఏళ్ల దళిత యువకుడు సందీప్ రాథోడ్ గుర్రం ఎక్కాడనే నెపంతో గుర్రంపై నుండి కింద పడేసి కొట్టి చంపారు. గత సంవత్సరం నాగపూర్ లో అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు అని సభా స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసినారు. ఎన్.సి.ఆర్.బి ఇచ్చిన లెక్కల ప్రకారం భారతదేశంలో అతిపెద్ద రాష్ట్రం యూపీలో హత్యలు 4,889, కిడ్నాప్ కేసులు15,898, లైంగిక దాడులు 4,816. దళితుల పైన దాడులు 10,426 పైగా నమోదయినాయి. ఎన్డీఏ పాలనలో 2014 సంవత్సరంలో 40,972 సంఘటనలు జరుగుతే 2021 సంవత్సరం నాటికి 50,900 దాడులు పెరిగినాయి.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు ఆమోదయోగ్యంగా లేదు. మార్చి 24,2022 న పార్ల మెంట్‌లో సమర్పించిన సమాచారం ప్రకారం తొమ్మిది మంత్రిత్వ శాఖలు, రైల్వేలు, ఆర్థిక, ఆటమిక్ ఎనర్జీ, రక్షణ, గృహ, హోం శాఖలతో సహా కేంద్ర ప్రభుత్వ శాఖలన్నింటిలో మొత్తం 82,022 ఖాళీలు ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన పోస్టులు న్నాయి. కానీ వాటిలో కేవలం 43శాతం ఖాళీ పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. యూనివర్శిటీలు,ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో పరిస్థితి కూడా చాలా ఘోరంగా ఉంది. ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 42శాతం ఖాళీ పోస్టులు భర్తీ చేయడంలో 45 సెంట్రల్ యూనివర్సిటీలు వైఫల్యం చెందాయి. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 80శాతం ఖాళీ పోస్టులను ఇంత వరకు భర్తీ చేయకపోవడంతో అది అధ్వాన్నమైన యదార్థ స్థితిగా నిలిచింది. మోడీ నాయకత్వంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు,ఉన్నత విద్యలో ప్రయివేటీకరణ వేగవంతం కావడానికి తోడు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో పాటు రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు.

ఎస్సీ సంక్షేమానికి కేటాయింపుల గణనీయమైన తగ్గింపు, ఖర్చులలో కోతలు విధించడం ద్వారా వివక్షత కొనసాగింపులో మోడీ ప్రభుత్వమే స్వయంగా తోడుగా నిలిచింది. 2014-15, 2019-20 మధ్య ఆర్థిక సంవత్సరాల్లో జనాభా దామాషా ఆధారంగా జరిగిన మొత్తం కేటాయింపుల్లో కేవలం 20.8శాతం మాత్రమే వారి సంక్షేమానికి ఖర్చు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు తెలియ జేస్తున్నాయి. ఇది,ఎస్సీ వర్గాలకు న్యాయంగా చెల్లించాల్సిన 7.51 లక్షల కోట్ల రూపాయలను నిలిపి వేయడంతో సమానం. దీనితో పాటు 2017-18లో ఎస్సీ సబ్‌ప్లాన్‌రద్దు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ఎస్సీ అభివృద్ధికి ఉద్దేశించబడిన యంత్రాంగాన్ని ధ్వంసం చేసింది. ఈ మార్పుల ఫలితంగా మోడీ రెండోసారి ప్రధాని పదవి చేపట్టిన 2019-20, 2023-24 మధ్య కాలంలో కేంద్ర రంగ ప్రాయోజిత పథకాల కేటాయింపుల మొత్తం నిధుల్లో ఎస్సీలకు కేవలం 10.6శాతం మాత్రమే కేటాయించారు. కేటాయింపుల్లో కూడా కేవలం 3.3శాతం మాత్రమే ఎస్సీల పథకాలకు మళ్ళించారు.



కేటాయించిన నిధుల్ని కూడా పూర్తి స్థాయిలో వినియోగించలేదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా దళితుల సాధారణ పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. 58శాతం దళితులకు భూమిలేదు. మోడీపరిపాలనలో దళితులను పెద్దసంఖ్యలో అభివృద్ధి పేరుతో వారి భూముల నుండి బలవంతంగా వెళ్ళగొడుతున్నారు. స్వంత భూములున్న 50శాతం దళితులకు సాగునీటి సౌకర్యాలు లేవు. సాధారణ జనాభాలో 33.3శాతం జనాభాతో పోల్చినప్పుడు 65.8శాతం దళితులు పేదరికంలో జీవిస్తున్నారు, ఇది చాలా తీవ్రమైన పరిస్థితి.

ఎస్సీలలో అక్షరాస్యతా రేటు కేవలం 66శాతంగానే ఉంది. అంటే జాతీయ సగటు రేటు 73శాతం కంటే కూడా తక్కువగా ఉంది. అంతే కాకుండా 2022 నాటికి ఎస్సీలలో నిరుద్యోగ రేటు 8.4 శాతంగా చాలా ఎక్కువగా ఉంది. ఎస్సీలలో అసంఘటిత రంగ కార్మికులు చాలా ఎక్కువగా 84శాతంగా ఉన్నారు. ఈ గణాంకాలు మోడీ నాయకత్వంలోని మతతత్వ, కార్పోరేట్ ప్రభుత్వం దళిత వ్యతిరేక,పేద ప్రజల వ్యతిరేక స్వభావాన్ని తెలియజేస్తుంది. మోడీ హిందూత్వ లేక 'సనాతన ధర్మ' భావ జాలంలో సామాజిక న్యాయాన్ని వెతకడం అంటే ఎండమావిలో నీటిని వెతకడం లాంటిదే.

మతం ప్రజల వ్యక్తిగత జీవితాల నుండి రాజకీయాల్లోనికి చొరబడడం మూలంగా ప్రజల మధ్య సౌభభ్రుత్వం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం. దళితులపై దాడులకు అంతే లేదు. అంతేగాక మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలన్నిటిని తన గుప్పట్లోకి తీసుకుంది. స్వతంత్ర న్యాయవ్యవస్థ అస్తిత్వం కూడా ప్రమాదంలో పడింది. ఆర్ఎస్ఎస్ కన్ను సన్నుల్లోని బిజెపి పదేండ్ల పరిపాలనలో దేశం సరిహద్దు ఉద్రిక్తతలు, దేశంలోపల మత విద్వేషాలు, గ్రామాల్లో కుల ఘర్షణలు మినహా బిజెపి దేశ ప్రజలకు చేసింది ఈ సమంతా మేలు జరగలేదు. పైగా దేశ ప్రజలందరి గుండెకాయ లాంటి భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి పూనుకుంది. రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి ఒక పథకం ప్రకారంగా సకల ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగానే 2023 ఫిబ్రవరి 15న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఆర్ఎస్ఎస్ కార్యకర్త కృష్ణారెడ్డి భారత రాజ్యాంగం పనికిరాదు 3000 ఏళ్ల కిందటి మనుస్మృతి మన ప్రాచీన భారత రాజ్యాంగం అని గ్రంథాన్ని రచించాడు దాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తే విద్యార్థులు, సామాజిక శక్తులు అడ్డుకున్నారు.

400 సీట్లు పార్లమెంట్లో గెలిస్తే భారత రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేస్తామని కర్ణాటక బిజెపి ఎంపీ అనంత హెగ్డే వాఖ్యానించాడు. గతంలో నిజామాబాద్ బిజెపి పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ భారత రాజ్యాంగాన్ని బాజప్తిగా మారుస్తామని చెప్పాడు. కేవలం ఆ ఇద్దరు ఎంపీలు మాటలు అనుకుంటే పొరపాటు అది ఆర్ఎస్ఎస్ సూచనతో బిజెపి నేతలు మాటలుగా మనం గుర్తించాలి. మరో ఐదేళ్లు బిజెపి అధికారంలో ఉంటే మన రాజ్యాంగాన్ని రద్దు చేయడం ఖాయం. మనుస్మృతి మాత్రమే ఉంటుంది. అందుకే రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరి పైన ఉంది.

స్వతంత్ర పోరాట స్ఫూర్తితో ఏర్పడిన భారత ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం కూడా ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా అమ్మి వేస్తుంది. రైల్వే, ఎయిర్ లైన్స్ ,ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ పోర్టు, బ్యాంకింగ్ రంగ సంస్థలు పాడి ఆవు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పోరేట్ సంస్థలకు అమ్మి వేస్తుంది. ప్రభుత్వ రంగం లేకపోతే రిజర్వేషన్లు ఉండవు. ఎలాగు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు చేయడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలని పూర్తిగా రద్దు చేయడం ద్వారా దేశంలో ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు లేకుండా చేయాలనే ఆర్ఎస్ఎస్ ఏజెండాను సిద్ధ శుద్ధితో బిజెపి అమలు చేస్తుంది. రిజర్వేషన్లను కోల్పితే రాజ్యాంగంలో మరో మూలస్తంభమైన సామాజిక న్యాయం సమాధి చేయబడుతుంది. రిజర్వేషన్లను సామాజిక న్యాయాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది.

ప్రతి పేదవాడికి ఒక్క గృహం నిర్మిస్తాం వాగ్దానం నీటి మూటగానే మారింది. ఇలాంటి ఎన్నో వాగ్దానం చేసింది. కాని అయోధ్య రాముడు, మతము, దేవుడు, గోవు, పాకిస్తాన్, కాశ్మీర్, చైనా వంటి వాటి చుట్టూ ప్రజల దృష్టిని మళ్లిస్తూ అసలు ప్రజా సమస్యలు పక్కదోవ పట్టిస్తుంది. అసంతృప్తితో ఉన్న ప్రజలను మతం మూసుకులో మభ్యపెడుతుంది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 25 మత స్వేచ్ఛనిచ్చింది. ఆర్టికల్ 26 మత ప్రచారం చేసుకుని హక్కును కల్పించింది. ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛను తెలియజేస్తుంది. కానీ వీటన్నిటిని తుంగలో తొక్కి భారత లౌకిక వ్యవస్థను నాశనం చేస్తూ,మతసామర్యం లౌకిక విలువల పరిరక్షణ కోసం కృషి చేయవలసిన అవసరం ఉంది.

ఏబిసిడి వర్గీకరణ పేరట దళిత ఉద్యమ నాయకులు గొర్రె కసాయి వాన్ని నమ్మినట్టుగా బిజెపి నరేంద్ర మోడీని నమ్మాడు. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో దళితుల ఓట్లను మళ్లీ మనువాద బీజేపీకి వేయించడానికి పచ్చి అవకాశవాదంగా దళిత ఉద్యమ నాయకులు మాట్లాడుతున్నాడు. ఏ పార్టీలో ఉన్న దళితులు బిజెపికి ఓటు వేయాలని చెప్పడమంటే దళితులపైన జరిగిన దాడులు, దౌర్జన్యాలన్నిటిని బలపరచడమే అవుతుంది. భారత రాజ్యాంగాన్ని రద్దు చేయాలనే బిజెపి ఆలోచనను సమర్థించినట్లే అవుతుంది. బిజెపికి ఓటు వేయాలని చెప్పడం అంటే దళితులను బలిపీఠం పైన పెట్టడమే అవుతుంది. చైతన్యమంతమైన దళిత సమాజం బిజెపి అనుసరిస్తున్న వైఖరి పట్ల అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉంది.

2024 పార్లమెంట్ ఎన్నికల్లో మనువాదం, మతోన్మాద శక్తులను ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలి. మరోసారి అధికారం లోకి రానివ్వద్దు. లౌకిక అభ్యుదయ ప్రజాస్వామిక శక్తులను బలపర్చాలి.



- మారుపాక అనిల్ కుమార్
9440482429

## ఉగాది ఎందుకు జరుపుకుంటారు? ఉగాది పచ్చడి ప్రాముఖ్యత ఏంటి?

ఉగ' అంటే నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది అంటే సృష్టి ఆరంభమైనదినమే ఉగాది. యుగం అనగా 'ద్వయంబీ లేదా 'జంట' అని అర్థం. ఉత్తారయణ, దక్షిణాయణ ద్వయ సంయుతం యుగం కాగా.. ఆ యుగానికి ఆది యుగాదిగా మారింది. ఉగాది శబ్దానికి ప్రతిరూపంగా ఉగాదిగా రూపొందింది..

ఉగాది అంటే అందరికి గుర్తుకు వచ్చేది తెలుగు వారి పండుగ. తెలుగు సంవత్సరం ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. కాబట్టి ఇది తెలుగు వారి పండుగ గుర్తింపు తెచ్చుకుంది. చైత్ర శుద్ధ పాద్యమి నాడు వచ్చే ఈ పర్విదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నూతన సంవత్సరంలో రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గ్రహశాంతులు లాంటివి జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచంగ శ్రవణాన్ని చేస్తారు. మరికొన్ని రోజుల్లో శార్వారి నామ సంవత్సరానికి ముగింపు పలికి 'ప్లవ' నామ సంవత్సరానికి స్వాగతం పలకనున్న నేపథ్యంలో ఉగాది విశిష్టత, చరిత్ర గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### ఉగాది విశిష్టత..

చైత్ర మాసం శుక్లపక్షం పాద్యమి రోజున ఆ విధాత ఈ జగత్తును సృష్టించాడని నమ్ముతారు. సోమకుడు వేదాలను తస్కరించిన కారణంగా మత్స్యావతారం ధరించిన విష్ణువు అతడిని సంహరించి వాటిని తిరిగి బ్రహ్మదేవుడికి అప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణప్రతీతి. చైత్ర శుద్ధ పాద్యమి రోజున సూర్యోదయ వేళలో బ్రహ్మ దేవుడు సృష్టిని సృష్టించాడని అంటారు. అంటే కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఆ రోజు వర్తింపజేస్తాడని నమ్మకం. అంతేకాకుండా వసంత రుతువు కూడా ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. అందుకే నూతన జీవితానికి నాందిగా ఉగాది పండుగను జరుపుకుంటారు.

శాలివాహనుడు పట్టాభిషక్తుడైన ఈ రోజు ప్రాశస్త్యంలోకి వచ్చిందని మరో గాథ ఉంది. 'ఉగాది', 'యుగాది' అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది అంటే సృష్టి ఆరంభమైనదినమే ఉగాది. యుగం అనగా 'ద్వయంబీ లేదా 'జంట' అని అర్థం. ఉత్తారయణ, దక్షిణాయణ ద్వయ సంయుతం యుగం కాగా.. ఆ యుగానికి ఆది యుగాదిగా మారింది. ఉగాది శబ్దానికి ప్రతిరూపంగా ఉగాదిగా రూపొందింది.

తెల్గుగువారే కాకుండా మరాఠీలు కూడా ఈ రోజు 'గుడిపడ్వా'గా, తమిళులు 'పుత్తాండు' అనే పేరుతో, మలయాళీలు 'విషు' అనే పేరుతో, సిక్కులు 'వైశాఖీ'గా, బెంగాలీలు 'పోయ్ లా బైశాఖ్' గా జరుపుకుంటారు...

### ఉగాది పచ్చడి ప్రాముఖ్యత...

ఉగాది రోజు ముఖ్యమైన వంటకం ఉగాది పచ్చడి. షడ్రచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుంది. జీవితంలో అన్ని భావనలను చెప్పే భావం ఇందులో ఇమిడి ఉంది. పచ్చడి ఒక్కొక్క పదార్థం ఒక్కో భావానికి, అనుభవానికి ప్రతీక.

బెల్లం- తీపి- ఆనందానికి ప్రతీక
ఉప్పు- జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతం
వేప పువ్వు- చేదు- బాధకలిగించే అనుభవాలు
చింతపండు- పులుపు- నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు
పచ్చి మామిడి ముక్కలు- వగరు - కొత్త సవాళ్లు
కారం- సహనం కోల్పోయేటట్లు చేసే పరిస్థితులు...

### యుగయుగాల ఉగాది...

రామాయణంలో చైత్రం 12 వనెల.రాముడు ఋతువులన్నీ గడిచి 12 వ నెల అయిన చైత్రమాసంలో శుద్ధ నవమినాడు జన్మించినట్లు బాల కాండలో ఉంది. ( తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ) దీనినిబట్టి రామాయణ కాలంలో వైశాఖ ప్రారంభమే సంవత్సరాది. మార్గశిర పుష్య మాసాలున్న హేమంతంతో సంవత్సరం ప్రారంభమని కౌత్యుడు మతం. అమరసింహుడు అమర కోశము కాలవర్గంలో మార్గశిర పుష్య మాసాలతోనే మొదటి ఋతువని అన్నాడు. మార్గశిర మాసానికి ఆగ్ర హాయణికః అనేది పర్యాయ పదం. ఆగ్రంలో హాయనం కలది- అంటే సంవత్సరమంతా ముందుండేది, లేక సంవత్సరాగ్రంలో ఉండేది. అంటే మన సంవత్సరాది మార్గశిర పుష్య, మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖాల వరకు దేకుతూ వచ్చిందనడం స్పష్టం. అంటే ఆశ్వీజామావాస్య కార్తీక పూర్ణిమ, మార్గశిర పుష్యాలలో సంక్రాంతి పండుగ, మాఘ పూర్ణిమ, ఫాల్గుణ పూర్ణిమ, హోలీ పండుగ, వసంతపంచమి, వైశాఖ పౌర్ణమీ ఇవన్నీ సంత్సరాదులే. రామాయణంలో అన్నట్లు వైశాఖంలో సవత్సరం ప్రారంభించే ఆచారం వల్లనే కాబోలు నేడు ఉత్తరాపథంలో సూర్యమాన సంవత్సరాదికి బైసాఖి (వైశాఖి) అనే వ్యవహారం ఉంది. భారతంలో చైత్ర వైశాఖ మాసాలు వసంత ఋతువనే గణన ఉంది. భవిష్య పురాణంలో యుగాదులను గూర్చిన వర్ణన కూడా సంవత్సరాది వైవిధ్యాన్ని ధ్రువ పరుస్తాయి. కృతయుగం వైశాఖ తృతీయనాడు, త్రేతాయుగం కార్తీక నవమినాడు, ద్వాపరయుగం ఆశ్వీజ త్రయోదశినాడు, కలియుగం ఫాల్గుణ పౌర్ణమినాడు పుట్టాయని కృష్ణుడు ధర్మరాజుకు చెప్పినట్టు, వీటిని యుగాదులంటారని అన్నట్టు ఉంది. (యుగాదయశ్చ కథ్యంతే తద్దైతాస్సర్వ సూరిభిః) మరి ఈ దినమే ఉగాది ఎలా?

ఋతువులు కాలధర్మంతో సంబంధించినవి కనుక సాయనాలు. ఎప్పటికప్పుడు కదిలిపోతుంటాయి విషువత్తుని బట్టి విషువత్ మారినా మనం ఇప్పటికీ చైత్ర వైశాఖ మాసాలు వసంతఋతువు అంటున్నాము. రామాయణ కాలంలో వైశాఖజ్యేష్ఠాలు వసంతం. భారతకాలంలో విషవత్ చలించడంవల్ల చైత్ర వైశాఖమాసాల్లో పడ్డది. అంటే భారతకాలంలో విషువత్ మృగశిరంలో వచ్చి, వరాహ మిహిరుని కాలానికి అశ్విన్యాదికి చలించింది. కనుకనే విష్ణుపురాణం మేషాదౌచ మృగాదౌచ మైత్రేయ విషవః స్థితాః అని చెప్పింది. తర్వాత మారుతూ వచ్చిందనే కదా!! నేడు మాఘమాసంతోనే వసంతఋతువు ప్రారంభ మవుతుంది. చైత్ర వైశాఖ మాసాలలో ఎండలు. నేడు ధర్మసింధువుకారుడు ఉగాది కాలానికి వేపకొళ్ళు తినడం చేయమన్నాడు. కాని మన ఉగాది కాలానికి వేపచిగుళ్ళు ముదిరి పూతకూడ రాలిపోయి, పిందెలు పుడుతున్నాయి.



వరాహమిహిరుడు క్రీస్తుశకం 5వ శతాబ్దివాడు. తనకు కొన్ని శతాబ్దాలముందే విషువత్ మృగశిరనుండి అశ్వినీ నక్షత్రం ప్రథమపాదానికి రావడం గుర్తించాడు. వేదాంగ జ్యోతిష్య కాలంకంటే ప్రాచీనమైన ప్రాహ్మణాలకాలంలో వసంత విషత్కాలం కృత్తికానక్షత్రంలో సంభవించిందని పరిశీలించాడు. తనకాలంలో వసంత విషవత్కాలం అశ్వన్యాదిలో సంభవించడం చేత ఆనాటినుంచి ఉత్తరాయణం దేవమానదినం ప్రారంభం కావడం ప్రాచీన సాంప్రదాయం కనుక అదే వసంత కాల ప్రారంభంగాను, ఆనాడే సంవత్సర ప్రారంభంగాను నిర్ణయించి మాస ఋతు సామరస్యం చేసాడు. వసంత విషత్కాలం చైత్రమాస ప్రారంభంగా పరిగణితమైందన్నమాట, కాని మనం ధర్మసింధు కారుడన్నట్టు శుక్ల ప్రతిపదాదినుంచి అమావాస్యతో ముగిసే కాలాన్ని నెలగా పరిగణిస్తున్నాము. నాటినుంచి నేటివరకు చైత్రమాసంలోనే ఉగాది పండుగ అనే ఆచారం ఏర్పడింది

వరాహమిహిరుడు వసంత విషువత్తును బట్టి ఋతు మాస సామరస్యం సాధించనేమో సాధించాడు. కాని అప్పటినుంచి వసంత విషవత్ 23 డిగ్రీలు వెనక్కు వస్తూ ఉంది.

మన ఉగాది చైత్రమాసంతోనే ఎందుకు మొదలవు తుంది అనే ప్రశ్నకు హెమాద్రి పండితుడు:

చైత్రమాసి జగద్బృహ్మ ససర్జ ప్రథమేహని,
శుక్ల పక్షే సమగ్రంతు తదా సూర్యోదయే సతి.

చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య-మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండే కాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగి పోతారు. ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం. ఇది మార్గశిర-పుష్య-మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషవత్కాలమంటే పగలూ రాత్రి సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు. మకర సంక్రాంతి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది.

ఈవిషువత్ నిర్ణయంలోనూ మత బేధం ఉంది. కటకం నుంచి- కటక విషువత్ నుంచి- దక్షిణాయనం, మకర విషువత్ నుంచి ఉత్తరాయణం ప్రారంభమౌతాయని నేటి సాంప్రదాయం. కానిపూర్వం ఆశ్లేషారథం నుంచి దక్షిణా యనం, ధనిష్ఠా ప్రథమపాదం నుంచి అంటే అభిజిత్తుతో సహా లెక్కపెడితే కుంభం నుంచి ఉత్తరాయణం, సింహం నుంచి దక్షిణాయనం ఉండేవని ఇప్పుడు అవి కటకాలకు మారాయని వరాహమిహిరుడు బృహత్సంహితలో తెలిపాడు.

మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోందిబీ తులతో రాత్రి. కనుక నేడు మకర కటకాలనుంచి ఉత్తర దక్షిణాయనాలు చెబుతారు అని శ్రీ పత్యాచార్యుడు అన్నాడు.

మనం ఉత్తరధ్రువ ప్రాంతం నుంచి బయలుదేరామను వాదం నిజమైతే, మేషవిషువత్తునుంచి మనకు దినం ప్రారంభం కావడం -6 నెలలు చీకటి 6 నెలలు వెలుతురు ఉండేదినం మొదలుకావడం నిజం. మనం ఉత్రార్ధగోళం వారం కనుక మేషంలోనే మనకు సూర్యోదయం. భూమధ్య రేఖపై సూర్యుడుండే దినం విషువత్. మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనుకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు. సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం- 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చింది. కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది...

నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!!

సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. అగ్ని పూజకులైన పార్సీలు ఎప్పుడో మననుంచి విడిపోయినవారు. వారి సంవత్సరాది నౌరోజ్. అది కూడా వసంతమాసంలో దాదాపు ఉగాదిదరిదాపు లలోనే రావడం కూడా చంద్రమానం ప్రాచీనతకు నిదర్శనం, ముస్లింలు ఏదేశం వారైనా పూర్తిగా చంద్రమానాన్ని వాడేవారే. కనుకనే వారి పండుగలు ఒకసారి చైత్రంలో, మరొకసారి వైశాఖంలో మారుతూఉంటాయి. చాళుక్యుల కాలంలో మాత్రం సూర్యమానం ఆంధ్రదేశంలో అధిక వ్యాప్తిలో ఉండేదట. ఇప్పుడు మనదేశంలో సౌరమానాన్ని వంగ, తమిళ, కేరళ, పంజాబు, సింధు, అస్సాం వారు అనుసరిస్తున్నారు.

మేషవిషువత్తే దైవతదినానికి - అంటే సంవత్సరార్ధానికి-ప్రారంభమైనప్పుడుబీ భాస్కరాచార్యుడు సిద్ధాంత శిరోమణిలో సూర్యుడు లంకానగరంలో వసంతఋతువు శుక్లపక్ష ప్రతిపత్తునాడు ఉదయించడంవల్ల (భూ మధ్య రేఖపై ఉండడాన్ని బట్టి) అనాడే ఉగాది అనడంవల్లబీ సంవత్సరం వసంతర్తుతో ప్రారంభిస్తుందని యజుర్వేదం ఒకవైపు ఘోషిస్తుండగనుబీ ధర్మసింధు, నిర్ణయసింధు కారులు ఈ ఉగాది పండుగ సంవత్సరాది పండుగ అనడం మాత్రమేకాక, నిర్ణయసింధుకారుడు శుద్ధపాడ్యమి నుంచి అమావాస్య వరకుగల కాలమే నెల అని నిర్ణయించి నప్పుడూ వివిధ విధాల సంవత్సరాదులేమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కాని ఋతునిర్ణయం లోను, సంవత్సరాది నిర్ణయంలోనూ ప్రాచీనకాలంలో వివిధాచారాలున్నాయనడమే దానికి సమాధానం. ఒకప్పుడు కార్తులను బట్టి ఋతు నిర్ణయం జరిగేది. వేదాంగ జ్యోతిష్ కాలంలో ధనిష్ఠా కార్తితో ప్రారంభమైన శిశిర ఋతువుతో- మాఘపూర్ణిమ నుండి రెండు నెలలతో మొదటి ఋతువు- సంవత్సరం ప్రారంభమయ్యేది. ఇది ఉత్తరాయణ ప్రవేశ కాలం కూడాను. ఇది పరాశరుడు మతం.

సంవత్సరాది పండుగమాట సరే!!

ఉగాది అనే మాట ఏమిటి? యుగమంటే కాలం. తదాది యుగాది. మనతోడివారైన కన్నడులు నేడూ యుగాది అని యకారాదిగానే దీనిని వ్యవహరిస్తారు. యకారాది పదాలు తెలుగుభాష సంప్రదాయం కాదు గనుక ఉగాది అయి ఉంటుంది.

అంబటి తిరుపతి
వెలుతురు దినపత్రిక స్టేట్ రిపోర్టర్..
9949055604.



మీకు మీ కుటుంబ సభ్యులకు అందరికీ ఉగాది శుభాకాంక్షలు



## కూకట్‌పల్లి సీనియర్ నాయకులు గొట్టిముక్కల పద్మారావుతో పట్నం మహేందర్ రెడ్డి భేటీ

**కూకట్‌పల్లి, వెలుతురు:**
మాజీ మంత్రి, ప్రస్తుత శాసనమండలి సభ్యులు, పట్నం మహేందర్ రెడ్డి సోమవారం సీనియర్ రాజకీయ నాయకులు, సినీ నిర్మాత గొట్టిముక్కల పద్మారావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోకి రావాల్సిందిగా మహేందర్ రెడ్డి పద్మారావును ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మారావు సానుకూలంగా స్పందించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ భేటీలో భాగంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎన్నికల వ్యూహాలు, జరుగుతున్న పరిణామాలపై సుధీర్ఘంగా చర్చలు జరిగాయి.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు కొప్పిశెట్టి దినేష్, మేకల మైఖేల్, మహిళా నాయకురాలు దుర్గారాణి, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

### ప్రారంభించిన డిసిఎంఎస్ ఇన్చార్జి ప్రవీణ్ రెడ్డి

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 08(వెలుతురు):** శంకర్పల్లిలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఇందులో నాణ్యతను బట్టి రెండు రకాలుగా విభజించారు. మొదటి రకం ఏ గ్రేడ్ కి రూ.2203/- రూ, రెండవరకం బి గ్రేడ్ వరికి రూ.2183/- లు గా ధర



నిర్ణయించడం జరిగింది అని అధికారులు అన్నారు. వరి ధాన్యాన్ని అమ్మధలచిన రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొని రావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సురేష్ బాబు, ఏ ఈ ఓ లు రమ్య, షీలా తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నీటి వ్యాపారం అరికట్టి భూగర్భ జలాలను కాపాడాలని

# ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసిన చంద్రారెడ్డి..

**కూకట్‌పల్లి, వెలుతురు:**
పాపిరెడ్డి నగర్‌లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్న సందర్భంగా అక్రమ నీటి వ్యాపారం అరికట్టాలని పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి ఆదివారం దీక్ష చేపట్టారు. అదేవిధంగా అక్రమ నీటి వ్యాపారం నిలిపి వేయాలని పాపిరెడ్డి నగర్‌లో భూగర్భ జలాలు కాపాడాలని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మరియు బస్తివాసులతో కలిసి సోమవారం స్థానిక ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింలు ముదిరాజ్, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, అనంత రాములు, కెవి. రాజు మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, ధర్మారావు, కన్నారావు, వనం ఆంజనేయులు, హనుమంత రెడ్డి, కనక రెడ్డి, వెంకట్ రెడ్డి, శరత్ రెడ్డి, పాండు గౌడ్, జగదీష్, శోభా రెడ్డి, అరుణ, పద్మ, మానెమ్మ, లక్ష్మీనారాయణ చారి, బాల్ రెడ్డి బస్తీ వాసులు పాల్గొన్నారు.



## తాగునీటి సరఫరాలో ప్రజలకు

# ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండాచర్యలు చేపట్టాలి

**వికారాబాద్ జిల్లా (ప్రతినిధి వెలుతురు న్యూస్):**
తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికా బద్దంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, రోడ్లు మరియు భవనముల శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన విజయేంద్ర బోయ అధికారులకు సూచించారు.

సోమవారం కలెక్టరేటులోని సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి విజయేంద్ర బోయ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ లతో కలిసి తాగునీటి సరఫరా పై జడ్పి సీఈవో, డిపిఓ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విజయేంద్ర బోయ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, దీనిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యతనిస్తూ అనునిత్యం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షింస్తూ తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైన ఉందని తెలిపారు.

ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారనే మాటకు అస్కారం లేకుండా బాధ్యతాయుతంగా, అంకిత భావంతో ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించాలని సూచించారు. అవసరమైన చోట నీటి రవాణా కోసం ట్యాంకర్లను వినియోగించాలని తెలిపారు. జిల్లాలోని మండలాల పరిధిలో గల నివాస ప్రాంతాలకు సరిపడా నీటి నిలువలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్న అంశం మీ అందరికీ అవగాహన ఉండాలని, అవగాహన ఉంటే సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించడాని వీలవుతుందని అన్నారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపిడిఓలు క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా తీరును అనునిత్యం పర్యవేక్షణ జరపాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే వాటిని సరిదిద్దాలని, తాగునీటి వ్యవస్థకు ఇబ్బంది తలెత్తకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ముఖ్యంగా మిషన్ భగీరథ ద్వారా పూర్తి స్థాయిలో నిర్ణీత పరిమాణంలో నీటి సరఫరా




జరుగుతోందా లేదా అన్నది మండల అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు సరి చూసుకోవాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రస్తుత వేసవిలో ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి సమస్య రాకుండా నిబద్ధతతో పని చేయాలని సూచించారు.

### హెల్ప్ డెస్క్ కంట్రోల్ నంబర్ 08416-242136

త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా కలెక్టరేట్ లో త్రాగునీటి కోసం హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రారంభించారు.
ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో, మున్సిపల్ పరిధిలో ప్రతి ఒక్కరి త్రాగునీటి సమస్యను తెలుసుకునేందుకు వీలుగా 08416-242136 టోల్ ఫ్రీ నంబర్ హెల్ప్ డెస్క్ కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు త్రాగునీటి సమస్య రాకుండా కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకై జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాలలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షణ జరిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నివాస



ప్రాంతాలలో నీటి కొరతను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతేకాకుండా ఎక్కడ నీటి సరఫరాకు ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నామని, అవసరమైన చోట బోరు మోటార్లు, చేతి పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపిస్తామని అన్నారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్ , మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, జెడ్పి సీఈఓ సుధీర్, డిపిఓ జయసుధ, డివిజనల్ పంచాయతీ అధికారులు సంధ్యారాణి, శంకర్ నాయక్, మిషన్ భగీరథ డిఇలు సుబ్రహ్మణ్యం, రత్న ప్రసాద్, శశాంక్ మిశ్రా, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, వెంకటయ్య, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.






## శ్రీ క్రోధిలో అన్నిరంగాల్లో శుభాలు కలగాలి

### తెలుగు ప్రజలకు మోత్కుపల్లి ఉగాది శుభాకాంక్షలు



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 08:
శ్రీ క్రోధనామ సంవత్సరంలో అందరికీ, అన్నీ శుభాలు జరగాలని మాజీ మంత్రి, మోత్కుపల్లి నరసింహులు ఆకాంక్షించారు. షడ్రుచుల ఉగాదితో ప్రారంభమయ్యే శ్రీ క్రోధ నామసంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరి సంపదలు, ఆనందాలు వెల్లి విరియాలని ఆశించారు.
తెలుగు నూతన సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులకు అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. అలాగే సకల వృత్తులవారు ఆనందంగా ఉండాలని, పల్లెలు పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## బిజెపి జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్‌గా నియమితులైన పి. హరీష్ కుమార్



జహీరాబాద్, 08 ఏప్రిల్, వెలుతురు :
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝూరా సంఘం మండలం దేవరంపల్లి గ్రామానికి చెందిన పి. హరీష్ కుమార్ బిజెపి పార్టీకి చేసిన సేవలను గుర్తించి భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ గా నియమిస్తూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పి. హరీష్ కుమార్ మాట్లాడుతూ నామీద నమ్మకంతో నన్ను భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ గా నీయమించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మల్లికార్జున్, జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ సతీష్, జహీరాబాద్ అసెంబ్లీ బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ పురుషోత్తం లకు, ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన సీనియర్ నాయకులు అందరికీ పేరుపేరునా హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. నాకు ఇచ్చిన ఈ బాధ్యతను పార్టీ కార్యక్రమాలను కార్యకర్తలకు, ప్రజలకు చేరవేయడంలో ముందుంటా అని పి. హరీష్ కుమార్ పేర్కొన్నారు.

## కోహీర్ మండలం పంచాయతీ సెక్రటరీ లక్ష్మణాచారిని సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



జహీరాబాద్, 08 ఏప్రిల్ వెలుతురు :
సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గ్రామ పంచాయతీ సెక్రటరీ , లక్ష్మణాచారిని సస్పెన్షన్ చేసినట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాలు జారీచేశారు. డంపింగ్ యార్డ్‌లో సరైన పారిశుధ్యం , వ్యర్థాలను సురక్షితంగా పారవేసేందుకు, గ్రామంలో సురక్షితమైన తాగునీటి సరఫరాలో విఫలమయ్యారు. డంప్‌యార్డులో కాకుండా రోడ్లపైనే చెత్త వేస్తున్నట్లు గుర్తించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం, చెత్తాచెదారం దహనం చేయడం పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని విధుల్లోనిర్లక్ష్యం కారణంగా సస్పెన్షన్ ఆర్డర్లు జారీ చేశారు .

## నూతన నియామకం

కరీంనగర్, వెలుతురు, ఏప్రిల్ 8:
జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ సిహెచ్ వి జనార్ధన రావు ఆదేశానుసారం కరీంనగర్ జిల్లా నూతన ఎస్ జి ఎఫ్ సెక్రటరీ గా నియామకం చేయడం జరిగింది, ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ( పి ఈ టి ఏ టి ఎస్ ), తెలంగాణ ఉపాధ్యాయ సంఘం టి జి పి ఈ టి ఏ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ టి పి యు ఎస్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు,



ఇట్టి నియామక పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి నూతన ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ గా ఎన్నికైన బి . వేణుగోపాల్ ప్రభుత్వ పాఠశాల మంకమ్మ తోట అందించడం జరిగింది, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు అంతడుపుల శ్రీనివాస్, కే సమ్మయ్య, కే కృష్ణ, ఆర్ నరసయ్య, సొల్లు సారయ్య, ఏ శంకరయ్య, బన్సీలాల్, జిట్టబోయిన శీను అభినందించారు.

## అర్చక పురోహిత సంఘ ఆధ్వర్యంలో జ్యోతిష్య పౌరోహిత్యంలో విశేషమైన సేవలను ఉగాది పురస్కారంతో సన్మానం

సిద్దిపేట టౌన్, వెలుతురు ఏప్రిల్ 08:
శనివారం రోజున సిద్దిపేట జిల్లా విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘ ఆధ్వర్యంలో జ్యోతిష్య పౌరోహిత్యంలో విశేషమైన సేవలను అందిస్తున్నందుకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం




కొండంరాజుపల్లి గ్రామానికి నారోజు సురేష్ ఆచార్య శ్రీ శ్రీ గాయత్రీ సమేత శ్రీమద్విరాట్ విశ్వకర్మ దేవాలయ కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్షులు బుర్గోజు బాల బ్రహ్మాచార్యులు ఉపాధ్యక్షులు పెందోట విష్ణుమూర్తి ఆచార్యులు కార్యదర్శి శ్రీ పెందోట ప్రభాకరాచార్యులు మరియు సంఘ కార్యవర్గ సభ్యుల సమక్షంలో ఉగాది పురస్కారంతో సన్మానించడం జరిగింది.

## పూలే జయంతి ఉత్సవాల నిర్వాణ కమిటీ
# చైర్మన్‌గా చిన్న శ్రీశైలం యాదవ్ ఎన్నిక

### అధికారికంగా ప్రకటించిన జాజుల శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 08:
సామాజిక సంఘసంస్కర్త బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అనగారిన వర్గాల జీవితాల్లో అక్షరాలు దిద్దించి వెలుగులు నింపిన మహాత్మ జ్యోతిబాపూలే 198వ రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి రాష్ట్రస్థాయి నిర్మాణ కమిటీ చైర్మన్ గా హైదరాబాద్ కు చెందిన బిసి కుల సంఘాల జేఏసీ కో చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్ ను ఎన్నిక చేసినట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు

సోమవారం హైదరాబాదులోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల సంయుక్త సమావేశంలో రాష్ట్ర చైర్మన్ శ్రీశైలం యాదవ్ ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు

ఈ సందర్భంగా మీడియాతో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అనగారిన వర్గాలకు అక్షరాలు దిద్దించి బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి ఈనెల 11వ తేదీన పెద్ద ఎత్తున ఊరు వాడల నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు

రాష్ట్ర రాజధానిలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి బీసీ కుల సంఘాల కో చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్ గారిని రాష్ట్ర చైర్మన్ గా ఎన్నుకున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు

గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ ప్రభుత్వం మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాన్ని హైదరాబాదులో ఏర్పాటు చేయాలని, పులే భవన్ నిర్మించాలని కోరినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోకుండా విస్మరించిందన్నారు, అందుకే పులే ని గౌరవించని గత ప్రభుత్వం ప్రతిపక్షంకే పరిమితం అయిపోయిందని ఆయన ఆరోపించారు

ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమైన బీసీల ఆకాంక్షను గౌరవించి హైదరాబాదులో 5 ఎకరాల్లో మహాత్మ జ్యోతిబాపూలే స్మృతి వనాన్ని ఏర్పాటు చేసి రెండు వందల అడుగుల పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు

దేశవ్యాప్తంగా బీసీ కులగనను చేస్తామని, బీసీ మహిళకు సబ్ కోట కల్పిస్తామని జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో పేర్కొనడం హర్షించదగ్గ విషయమని ఎందుకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల నిర్వాణ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ ఏప్రిల్ 11వ తేదీన హైదరాబాదులో వేలాది మందితో పెద్ద ఎత్తున పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

జయంతి ఉత్సవాలను రాజకీయ పార్టీలకు అతీతంగా అందరిని ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు, మాహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు

మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల షాంకూర్మ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుదాని సదానందం, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షులు మాదేశి రాజేందర్, శ్రీనివాస్ యాదవ్, మహేష్ మేరు తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి
# ప్రజలకు తెలియజేయాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- తెలంగాణ వొద్దు అంటూ గన్ను ఎక్కుపెట్టిన వ్యక్తి రేవంత్ అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావడం బాధాకరం
- రేవంత్ రెడ్డి జై తెలంగాణ అన్నాడా..? అమర వీరులకు నివాళి అర్పించారా..?
- సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్ కు ఎత్తు కెళ్లారు
150 కోట్ల నిధులు రద్దు చేశారు
సిద్దిపేట జిల్లా సిద్దిపేట కు రైలు సిద్దిపేట కు గోదావరి జలాలు వొచ్చాయి అంటే కేసీఆర్ తో జరిగింది

సిద్దిపేట టౌన్‌ం, వెలుతురు ఏప్రిల్ 08:
మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేటలోని కొండ మల్లయ్య గార్డెన్స్ లో జరిగిన సిద్దిపేట నియోజకవర్గ స్థాయి యువత సమావేశంలో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మాట్లాడుతూ
కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి
రేవంత్ రెడ్డి జై తెలంగాణ అన్నాడా..? ఒక్క పరీక్ష నిర్వహించారా మా హయాంలో ఉద్యోగాలు వొస్తే మీరుగా చెప్పుకుంటారా
దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్ లో చెల్లుతుందా తెలంగాణ వొద్దు అంటూ గన్ను ఎక్కుపెట్టిన వ్యక్తి రేవంత్
అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావడం బాధాకరం సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్ కు ఎత్తు కెళ్లారు
150 కోట్ల నిధులు రద్దు చేశారు సిద్దిపేట అభివృద్ధి ని అడ్డుకున్న కాంగ్రెస్ బీజేపీ లకు బుద్ధి చెప్పాలి 18 గంటలు మీకోసం పనిచేశా మీ కుటుంబ సభ్యుడిగా పనిచేశా కొన ఊపిరి ఉన్నంత వరకు మీకోసం పనిచేస్తా
సిద్దిపేట అభివృద్ధి శ్వాస గా పనిచేస్తా
నేటి యువతే భవిష్యత్ వారసులు కాబోయే ప్రజాప్రతినిధులు అధికారులు మీరే కావాలి
మిమ్మల్ని కంటి రెప్పలా చూసుకుంటాం
సోషల్ మీడియాలో కొత్త పుంతలు తొక్కేలా పనిచేయండి
స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకుందాం
అవార్డుల ఖిల్లా సిద్దిపేట నెంబర్ 1 కేసీఆర్ లేకుంటే తెలంగాణ వొచ్చేనా
చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చారు
ఎంతో మంది త్యాగాల ఫలం తెలంగాణ రాష్ట్ర సాకారం
రేవంత్ అమర వీరులకు నివాళి అర్పించారా..?
మీరే నా బలం నా బలగం
మాజీ కలెక్టర్ గా వెంకట్రామరెడ్డి మీకు సుపరిచితమే..
యువత పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వాలి
సిద్దిపేట లో ఖ్యాతి గాంచిన వెంకట్రామరెడ్డి కి పార్లమెంటు కు ఎంపీ గా ఎన్నికయ్యేలా చూడాలి
హమాలీ కార్మికుడి బిడ్డలు ఎంబీబీఎస్ సీట్లు వొస్తే వారికి అండగా నిలిచారు
అనాధలు రాధా రాధికలకు అండగా ఉన్నారు...
వెంకట్రామరెడ్డి కలెక్టర్ గా ఉన్నప్పుడు రాత్రి పగలు పనిచేశారు బద్ది పడగలో అనాధ పిల్లలకు అండగా నిలిచి తలా లక్ష అందించారు
6 గ్యారంటీ లు ఏమాయే
100 రోజులు గడిచినా రుణమాఫీ రైతు భరోసా మహాలక్ష్మీపించిన్ స్కూటీ పథకం రానోళ్లు 4 వేల పించిన్ అందుకోనోళ్లు వరి బోనస్ రానోళ్లు ఎక్కడికక్కడ నిలదీయాలి
ఫిబ్రవరి పించిన్ ఎగ్గొట్టినారు దేవుడు అందరి వాడు సిద్దిపేట లో ఎన్నోదేవాలయాలు నిర్మించాము
సిద్దిపేట జిల్లా సిద్దిపేట కు రైలు సిద్దిపేట కు గోదావరి జలాలు వొచ్చాయి అంటే కేసీఆర్ తో జరిగింది
బీజేపీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు అంటూ మోసం డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలు పెంచి ఆగం చేశాడు నిరుద్యోగం పెంచాడు ఎడ్లు బండి నిరుద్యోగ భృతి లాంటి మాయ మాటలు రఘునందన్ ను దుబ్బాకలో చిత్తుగా ఓడించారు
జిల్లాలు రద్దు చేస్తానంటున్న రేవంత్ కు ఓట్లు రద్దు చేయాలి
మెదక్ ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి ఎక్కడైతే కలెక్టర్ గా ఖ్యాతి గాంచిన చోట నే ప్రజా సేవలో ఎంపీ అభ్యర్థి గా అవకాశం రావడం సంతోషం కలెక్టర్ గా పనిచేసేటప్పుడు నా దగ్గర పనిచేసే బాబు కు నేను ఎమ్మెల్సీ అయిన తర్వాత రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు నాకు ఫోన్ లో సమాచారం వొస్తే నేను తల్లడిల్లి యశోదాకు పోయి మెరుగైన వైద్యం అందించాలని బాగైతే బాబు తో కలిసి తిరుపతి వెంకన్నకు తల నీలాలు సమర్పిస్తామని మొక్కాను రూ 58 లక్షలు వెచ్చించి ఆరోగ్యం బాగు చేయించి తిరుపతి కి వెళ్లి తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నాం
ఉట్టి మాటలు చెప్పడం లేదు గట్టిగా పనిచేస్తా
మీకోసమే నా ఆరాటం.. మీరు బాగు పడాలన్నదే నా తపన యువత తలుచు కుంటే ఏదైనా సాధ్యమే
కలెక్టర్ గా పనిచేశా మీబాగు కోసం కృషి చేస్తా యువతకు దశ దిశా నవుతా యువతరానికి చుక్కాని అవుతా నిరుపేదల చదువు కష్టాలు కళ్లారా చూశా
మీలాంటి యువకుల కోసమే 100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు



వెంకట్రామరెడ్డి కామెంట్స్...
సైనికుల్లా ముందుకు సాగుతున్నారు ..
నాగెలుపులో యువత కీలక పాత్ర పోషించాలి
ఒక కలెక్టర్ ఎంపీ అవుతున్నాడు అంటే మనకు గర్వకారణం
కలెక్టర్ గా ఖ్యాతి ఇచ్చారు..ఎంపీ గా గెలిపించాలి..
ఐ ఏ ఎస్ అధికారిగా ఇక్కడే పనిచేసిన ఘనత నాకే దక్కింది
కేసీఆర్, హరీశ్ రావు గార్ల సహకారంతో సిద్దిపేట జిల్లాను దేశంలోనే ఆదర్శం గా తీర్చిదిద్దాం
నేను ర్యాంక్ సాధించినప్పుడు తెలంగాణ ఒక తరం వెనుకబాటులో ఉంది..
అత్యధిక కాలం ముఖ్యమంత్రుల వద్ద పనిచేసిన ఘనత నాకు దక్కింది
ఉద్యోగ అవకాశం వొస్తే అది భగవంతుడు ఇచ్చిన అవకాశం గా భావించి నా దగ్గరికి వచ్చిన వారిలో నా కుటుంబ సభ్యున్ని చూసుకున్నా
నా పని తీరు నచ్చే సుదీర్ఘ కాలం పనిచేసేలా చేసింది
ఏర్పాటు చేస్తున్నా మీ అందరికి సుశిక్షులైన అధ్యాపకులతో ఉచిత కోచింగ్ ఇప్పిస్తా
వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తా 6 మాసాల కొకసారి జాబ్ మేళా ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి శిక్షణ అందిస్తా
7 నియోజకవర్గములలో తలా2 కోట్లు వెచ్చించి 7 ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తా
బీఆర్ఎస్‌తో పాటు నిరుపేదలకు కేవలం రూపాయికి అందిస్తా ఎన్నికల్లో నిలబడే అభ్యర్థుల గుణ గణాలను చూడండి ఎన్నికల్లో ఎడ్లు బండి నిరుద్యోగ భృతి పించిన్ ఆసుపత్రి నిర్మాణం చేస్తానని ఎమ్మెల్యే గా గెలిచి మోసం చేసిన రఘునందన్ కు మొన్న ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు గట్టిగా బుద్ది చెప్పాలన్నారు బీఆర్ఎస్ లో యువత పాత్ర కీలకం
మీరు 35 రోజులు మీరు పనిచేస్తే 5 ఏళ్ళు మీ వెంట ఉంటా
ఉద్యమాల గడ్డ సిద్దిపేట ఎంపీ అభ్యర్థి విజయంలో కీలక పాత్ర ఒక కలెక్టర్ గా పనిచేసిన వ్యక్తిని పార్లమెంటు లో అడుగుపెట్టే అవకాశం కల్పించాలి.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**మోకిల గ్రామ అధ్యక్షుడు గాండ్రా సత్యం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు**

**పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ చేవెళ్ళ నియోజకవర్గ ఇంచార్జ్ పామెన భీంభరత్**



**శంకర్‌పల్లి ఏప్రిల్ 8 (వెలుతురు):** మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ పామేన భీంభరత్ అన్నారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు సోమ వారం సత్యం ఆధ్వర్యంలో ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ పండుగలు కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతి కంగా నిలుస్తాయన్నారు. హిందు, ముస్లిం సోదరభావానికి ప్రతిక ఇఫ్తార్ విందులన్నారు. ఉపవాస దీక్ష ముగించిన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం గొప్ప పుణ్యకార్య మన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్ రెడ్డి , సమన్వయ కమిటీ చైర్మన్ సత్య నారాయణ రెడ్డి, చేవెళ్ళ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ఉదయ్ మోహన్ రెడ్డి, అజస్ భాయ్, రవీందర్ రెడ్డి , శేరి అనంతరెడ్డి , ప్రకాష్ గుప్తా, ప్రశాంత్ కుమార్, మహబూబ్ హుస్సేన్ , పెంటయ్య, నసీరుద్దీన్, ప్రసాద్, శ్రీకాంత్ ముదిరాజ్, మల్లికార్జున్, జగదీష్, శివ యాదవ్, అస్లాం, బిక్షపతి, హనీఫ్, వెంకట ముదిరాజ్, సంజయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జీవిత చరిత్ర

# కరపత్రం ఆవిష్కరణ

**అంబేద్కర్ జీవితం త్యాగాలమయం**

**ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం**

**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర తెలుసుకుందాం**



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 8 (వెలుతురు):** సోమవారం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర కరపత్రాన్ని సత్యనారాయణ సార్ అశోక్ మౌర్య సార్ బి. లక్ష్మణ్ మాల వికాస్, శేఖర్,ఆనంద్, సంజిత్ లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశంలోని అసమానతలపై విరోచిత పోరాటం చేసిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు.

అంబేద్కర్ త్యాగాల పోరాట ఫలితంగా భారత రాజ్యాంగం ద్వారా భారతదేశ ప్రజలకు హక్కులు, రిజర్వేషన్లు కల్పించబడ్డాయి అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సమ సమాజమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బేగరి ప్రభాకర్,చేవెళ్ల మండల అధ్యక్షులు మల్లెపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుకావలి గణేష్, వెంకటేష్ మాజీ సర్పంచ్ బి. సుధాకర్ టి.నర్సింలు, పర్వేద రవి, శీను తదితరులు పాల్గొన్నారు.





# కోహిర్ మండలంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి పర్యటన

**తాగునీటికి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి**

**చెత్తను కాలిస్తే కఠిన చర్యలు : గ్రామాలలో పారిశుధ్య పనులు నిర్లక్ష్యం పై కలెక్టర్ ఆగ్రహం**

**జహీరాబాద్, 08 ఏప్రిల్, వెలుతురు:** గ్రామాలలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను హెచ్చ రించారు. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని పలు గ్రామాలలో సోమవారం ఆమె క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. కోహిర్ మండల కేంద్రంతో పాటు నాగిరెడ్డిపల్లి , దిగ్వల్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. కోహిర్, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో పరిశుద్ధ పనుల్లో అలసత్వంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రతిరోజు శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని తాడిపూడి చెత్త వేరు చేయాలని చెత్తను డంపు యార్డ్ కు తరలించి సిగ్రిగేషన్ చేయాలన్నారు. అలా చేయకుండా చెత్తను కాలుస్తుండడంపై కలెక్టర్ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్చిన వారిని గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, వారికి అపరాధ రుసుము విధించాలని స్థానిక ఎంపీడీవోను ఆదేశించారు.

మండలంలోని మిషన్ భగీరథ పైపులు రిపేర్ ఉంటే వెంటనే చేయించాలన్నారు. కమ్యూనిటీ సోప్ పెట్ ఏర్పాటు చేయాలన్నారు.

మిషన్ భగీర ద్వారా పూర్తిస్థాయిలో త్రాగునీరు అన్ని గ్రామాలలో అందించాలి అని అధికారులు ఆదేశించారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలో మూడు 3 త్రీఫేస్ మోటర్లు 9 సింగిల్ ఫేస్ మోటర్లు గ్రామానికి నీటి ఎద్దడి లేకుండా పంపిణీ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు .

గ్రామంలో 200 మీటర్ల పొడవు వున్న డ్రైనేజీ ఉపాధి హామీ ద్వారా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అమ్మ ఒడి ఆదర్శ పాఠశాల కమిటీలు గురించి , స్కూల్ యూనిఫామ్ కొలతల గురించి మన ఊరు మనబడి లో పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ సెలవులు ప్రారంభం అయ్యేలోపు స్కూల్ యూనిఫామ్ కొరకు కొలతలు తీసుకోవాలని అన్నారు. స్కూల్ యూనిఫార్మ్ కుట్టడానికి మహిళా సంఘాలకు అందించాలన్నారు.

ఏడవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు ఫైనల్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారని అడిగారు. బాగా చదువుకోవాలని, మంచి మార్కులు సాధించాలని, ఇంటి వద్దనే ఉండి ఆనందించాలని చెరువులు కుంటల్లో వద్దకు పోయి ఆడవద్దని వేసవిలో నీడ పట్టున ఆడుకోవాలని విద్యా ర్థులకు సూచించారు.

**దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ**

కలెక్టర్ క్రాంతి వల్లూరు గద్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగాఅవుట్ పేషెంట్ రిజిస్టర్ పరిశీలించారు. ప్రతిరోజు 100 ఔట్ పేషెంట్లు రిజిస్టర్ అవుతున్నారని డాక్టర్లు తెలిపారు.

నార్మల్ డెలివరీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్ స్టాకు వివరాలు వివరాలు అడిగారు. ఆశ వర్కర్స్ తో ఇంటింటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. మందులు స్టాక్ వివరాలు పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్డిఓ రాజు , మండల ప్రత్యేక అధికారి జంగారెడ్డి తాసిల్దార్ బాల శంకర్, ఎంపీడీవో భారతి మిషన్ భగీరథ ఇంజనీర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపీగా నీలం మధును

# భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

**టీపీసీసీ రాష్ట్ర సెక్రెటరీ గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి**



**సిద్దిపేట టౌన్, వెలుతురు ఏప్రిల్ 08:** సిద్ధిపేట పట్టణంలో టీపీసీసీ రాష్ట్ర సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది అని మెదక్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గల్లో భారీ మెజార్టీ ఇవ్వాలని దానికోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని నాయకుల అందరు సమన్వయంతో కలిసి పనిచేసి తెలంగాణ తల్లి సోనియా గాంధీ కి బహుమతిగా ఇస్తామని ఆయన అన్నారు 10 సంవత్సరాల మోదీ పరిపాలనలో దేశంలో ఏలాంటి సంక్షేమం జరగలేదు అని కాంగ్రెస్ స్థాపించిన సంస్థలని మోదీ అమ్మేసి ప్రభుత్వ సంస్థలను ప్రయివేటికరణ చేసి వ్యాపారులకు దోచిపెట్టారని 10 సంవత్సరాల నుండి బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసింది అని విభజన హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యింది అని బిఆర్ఎస్-బిజెపి రెండు వేరువేరు కాదని పార్టీలు వేరు అయినా వాటి ఆత్మ ఒక్కటేనాని ఆయన అన్నారు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ రిజర్వేయార్ నిర్మాణ సమయంలో రైతులకు రావాల్సిన పరిహారం చెల్లింపు విషయంలో రైతులకు తీవ్ర అన్యాయం చేసాడని ఏ అర్హత ఉంది అని బిఆర్ఎస్ ఎంపీ టికెట్ కేటాయించారో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలని ఆయన డిమాండ్ చేసారు

ప్రకృతిని అడ్డుపెట్టుకొని బిఆర్ఎస్ పార్టీ కరువు రాజకీయం చేస్తుందని విమర్శించారు కరువు రావడానికి కాంగ్రెస్ పార్టీ కారణమని బిఆర్ఎస్ నేతలు విమర్శించడం దారుణం అన్నారు. కరువును కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. అధికారంలోకి వచ్చిన లోని ఆరోగ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు జమ చేయడానికి ఇంత సమయం పట్టేదో ఆలోచించాలి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల వల్ల పాలైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పాలించిన పది సంవత్సరాలు కాలంలో 7 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నీలం మదును గెలిపించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్ రెడ్డి చందు దిలీప్ కుమార్ వెంకటరెడ్డి వీరారెడ్డి అఖిల్ గౌడ్ ప్రకాష్ రాజు విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**- జిల్లా ఎస్పీ ఎన్.ఎస్పీ కోటిరెడ్డి, ఐపీఎస్**




**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** జిల్లాలోని ప్రజలందరికీ శ్రీ క్రోధినామ ఉగాది సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోటిరెడ్డి . మాట్లాడుతూ ఉగాది పండగను ప్రజలు ఆనందంగా ఉత్సాహంగా జరుపుకోవాలని, ఈ నూతన సంవత్సరం అందరికీ కొత్త ఉత్తేజాన్ని ఉల్లాసాన్ని ఉజ్వల భవిష్యత్తును అందించాలని తెలిపినారు. శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పండుగ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు శాంతి శ్రేయస్సు సామరస్యం సంతోషాన్ని కలిగించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను తెలిపినారు.

## నవాబ్‌పేట బీజేవైఎం ఉపాధ్యక్షులుగా

# పెద్దమల్కు బుచ్చిరాం


**వికారాబాద్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):** వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండల బీజేవైఎం ఉపాధ్యక్షులుగా ఎల్లకొండ గ్రామానికి చెందిన పెద్దమల్కు బుచ్చిరాం నియమితుల య్యారు. ఈ మేరకు సోమవారం బీజేపీ పార్టీ వికారాబాద్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రకటించారు.బీజేపీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అనుగుణంగా పార్టీని మరింత పటిష్టపరిచి.. విస్తరింపజేయాలని ఆయన పేర్కొన్నారు.



ఈ సందర్భంగా బీజేవైఎం ఉపాధ్యక్షులు బుచ్చిరాం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహిస్తానని, కార్యకర్తలు, కమిటీలను కలుపుకొని బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌ను కలిసిన శంకర్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

**శంకర్‌పల్లి ఏప్రిల్ 08 (వెలుతురు):** శంకర్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం నాడు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ను వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. అనిల్ కుమార్ యాదవ్ ను పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్



ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుని వలే పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మడుపతి ప్రవీణ్, నాగభూషణం, రఘునందన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

**నవాబుపేట (వెలుతురు న్యూస్):** వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ పేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం మండల ప్రజా ప్రతినిధులు రాకపోవడంతో కోరం లేని కారణంగా ఇంచార్జ్ ఎంపిడివో అజేయ్ కుమార్ సమావేశాన్ని వాయిదా వేసినట్టు ప్రకటించారు.




ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభించాల్సి ఉండగా అధికారులు నిధానంగా 12 గంటల వరకు హాజరయ్యారు.

ప్రజల సమస్యలను అధికారుల ముందు ప్రస్తావించి సమస్యలను పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం వారి చిత్తశుద్ధిని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సర్వసభ్య సమావేశాన్ని తిరిగి త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

# ఉగాది పండుగ శుభాకాంక్షలు

**కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి**



**మేడిపల్లి, వెలుతురు:** ఉగాది సందర్భంగా పీర్జాదిగూడ పట్టణ ప్రజలకు కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కొత్త సంవత్సరంలో ప్రజలకు శుభం కలగాలని,ప్రజల ఆశలు ఆకాంక్షలన్నీ నెరవేరాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

## తెలుగు నూతన సంవత్సర శ్రీ క్రోధి ఉగాది పర్వదిన శుభాకాంక్షలు

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరిశ్ రావు



సిద్దిపేట రూరల్, వెలుతురు ఏప్రిల్ 08: తెలుగు నూతన సంవత్సరాది శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరిశ్ రావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలన్నారు. ఉగాది పచ్చడిలాగే మీ జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరుతు తెలుగు వారి సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఉగాది సందర్భంగా శ్రీ క్రోధి నా అంత శోభయమానంగ విరిజిల్లాలని ఆకాంక్షించారు ఈ సంవత్సరం అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాదించాలని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని రైతులు ఆనందంతో పాడి పంటలతో వర్ధిల్లాలన్నారు ఈ క్రోది నామ సంవత్సరంలో అన్ని పాలద్రోలి అన్నింటా శుభం జరగాలని భగవంతుణ్ణి ప్రార్ధించారు. ఈ కొత్త సంవత్సర పర్వదినం అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకున్నారు.

## అత్యత ప్రవిత్ర మైనది రంజాన్ మాసం

### ఇఫ్తార్ విందులో పాల్గొన రాష్ట్ర ఆరోగ్యం శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా, ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కార్

వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 08 :





సంగారెడ్డి జిల్లా :- నారాయణాఖేడ్ నియోజికవర్గంలోని సాయిబాబా ఫంక్షన్ హల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పెద్ద ఎత్తునా ముస్లిం సోదరులు పాల్గొన్నారు ముఖ్య అతితులుగా రాష్ట్ర ఆరోగ్యం శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా, ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిర్మలా జగ్గారెడ్డి, ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ శెట్కార్ మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యత ప్రవిత్ర మైనది అన్ని సమాజం లో ప్రతి ఒకరిని సుఖ సంతోషం గా ఉంచాలి అని అల్లను ప్రార్థిస్తున్నామన్నారు, శాంతి కి రంజాన్ ప్రతీక అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ షేట్కార్, పీసీసీ సభ్యులు కే శ్రీనివాస్, పీసీసీ సభ్యులు శంకరయ్యాస్వమి, మాజీ సర్పంచ్ అప్పారావు షేట్కార్ ,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి శివ రాథోడ్,ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ కోప్షన్ సభ్యులు రషీద్, నారాయణాఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షేట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్,నారాయణాఖేడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తహిర్ అలీ, సద్దాం,ఎస్టీ నాయకులు రమేష్ చౌహన్, బియేస్ విర్ శెట్టి,మూతజ్ మాజీ ఎంపీటీసీ, రషీద్, మొహిద్దీన్, భారీ షెట్, సుల్తాన్ షెట్ తదితరులు పాల్గొన్నారు.

## పగడాల శ్రీశైలంని సన్మానించిన రంగారెడ్డి జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ..

రంగారెడ్డి జిల్లా వెలుతురు ఏప్రిల్ 08:



బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గా నియమితులైన పగడాల శ్రీశైలం ని రంగారెడ్డి జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై. కొండల్ రెడ్డి గారు మరియు ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ గార్లు మరియు ఎగ్జిక్యూటివ్ టీం మరియు న్యాయవాదులు, బిజెపి లీగల్ టీం సాల్వతో సన్మానించి, అభినందనలు తెలిపారు. మరియు మరో కన్వీనర్ వెంకట్ గౌడ్ గారిని కూడా సన్మానించారు...

న్యాయ పరమైన సమస్య పరిష్కారం కోసం పనిచేయాలని అన్నారు..

కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పామ్ రాజేందర్ రెడ్డి , స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ అశోక్ అందెకర్ ,జాయింట్ సెక్రటరీ రాధాకృష్ణ, మహిళా ప్రతినిధి మీనాక్షి, కోశాధికారి కేరిత్ కుమారి, లైబ్రరీ సెక్రటరీ రాములు, ఎగ్జిక్యూటివ్ మెంబెర్ ప్రవీణ్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు, న్యాయవాది జరుపుల విజయ్ నాయకులు, బిజెపి లీగల్ టీం దర్శన్ గద్వాల, నర్సింగ్, శ్రీకాంత్ పోరెడ్డి, చుంచు బాల్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి,నరేష్,నగేష్, కిరణ్ జిల్లా కోర్ట్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

# ఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం



వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 08, సంగారెడ్డి జిల్లా: నారాయణఖేడ్ పట్టణంలో సోమవారం నాడు జీవన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభిమానుల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీసీసీ ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ సురేష్ కుమార్ సెట్ కార్ కు భారీ మెజార్టీ గెలిపించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణఖేడ్ శాసనసభ్యులు పి సంజీవరెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులకు సూచించారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని అందుకోసం రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కలిసికట్టుగా భారీ మెజార్టీ నుంచి నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రజలు సురేష్ కుమార్ కు ఎంపీగా గెలిపించాలని వారి విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ కుమార్ సెట్ కార్ మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రజలు గట్టంలో 50 వేల మెజార్టీ ఇచ్చారని అదే బాటలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మీ సురేష్ కుమార్ మెజార్టీని ఇచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా సభ్యులు నగేష్ సెట్ కార్ పీసీసీ సభ్యులు కే శ్రీనివాసులు శంకరయ్య స్వామిరాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ సెట్ కార్ డిసిసి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి కాంగ్రెస్ యువజన నాయకులు సాగర్ సెట్ కార్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని సాయిలు బీసీ సెల్ అధ్యక్షులు సాయిలు పటేల్ ఎస్టీ సెల్ అధ్యక్షులు నెహ్రూ నాయక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తహెరెల్లి పలువురు కాంగ్రెస్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహకు కాంగ్రెస్ అభ్యర్థి అయిన సురేష్ కుమార్ సెట్ కార్ కు ఎమ్మెల్యే కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు గజమాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

## ఉపాధిహామీ పని ప్రదేశాల్లో

# కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

కరీంనగర్, వెలుతురు, ఏప్రిల్ 8: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు,మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు.

సోమవారం రోజున పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డి ఆర్ డి ఓ ఉప్పుల శ్రీధర్ గారికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో ఉపాధిహామీ కూలీలకు మంచినీటి సౌకర్యం,నీడ సౌకర్యం కల్పించడంతో పాటు,ఓరెస్ ప్యాకేట్స్ పంపిణీ చేయాలని అన్నారు.అలాగే కూలీల పనుల సమయాన్ని 7 గంటల నుండి 11 గంటల వరకు కొనసాగించాలని ఎక్కువ సమయం వరకు చేయించడం వల్ల ఎండ దెబ్బ కొట్టి కూలీలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దూర ప్రాంతాలకు వెళ్లే



కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాపై క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ చేయాలని,కూలీల ఇబ్బందులు తెలుసుకోవాలని,విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కొన్ని గ్రామాల్లో12 గంటల వరకు పనులు చెపిస్తున్నారాని, ఫోటో అప్లోడ్ చేసిన తర్వాత కూలీలు ఇంటికి వెళ్లే పరిస్థితి దాపురించిందని అన్నారు.ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు పనికి ముందు పని అయిపోయిన తర్వాత రెండు సార్లు ఫోటో అప్లోడ్ చేసి పద్దతిని వేనిక్కి తీసుకోవాలని,వర్షాలు లేక వ్యవసాయేతర భూములు గట్టిగా మారాయని అట్టి ప్రదేశాల్లో కొలతలు పెట్టి కూలీలతో పనులు చేయించడం వల్ల భూమి గట్టిగా ఉండడం వల్ల కొలతల ప్రకారం పనులు చేయక సరైన వేతనం పడక కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని,దీన్ని దృష్టిలో ఉంచుకుని కొలతలు లేకుండా పనులు కల్పించి కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని,కిలో మీటర్ పైగా దూరం ఉన్న పని ప్రదేశాలకు వెళ్లేందుకు కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బోయిని అశోక్,జిల్లా నాయకులు ఎగుర్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# జరగబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం కష్టపడి పని చేయండి..

### ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి...

### నేటి కాంగ్రెస్, గత బిఆర్ఎస్ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి...

### బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్

కరీంనగర్, వెలుతురు, ఏప్రిల్ 8: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం బీజేవైఎం శ్రేణులంతా సిద్ధం కావాలని, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్‌ను తిరిగి భారీ మెజారిటీతో గెలిపించ డానికి తగిన కృషి చేయాలని, అందుకోసం తగినకార్యాచరణతో ముందుకుసాగి కష్టపడి పని చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్లోని బిజెపి జిల్లా కార్యాలయంలో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఇట్టి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల్లో బిజెపిమోదీ ప్రభుత్వామే మళ్లీ కేంద్రంలో ఉండాలనే ఆకాంక్ష బలంగా ఉందన్నారు. ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్.. అబ్ కీ బార్ 400 సీట్ల నినాదంతో



దేశవ్యాప్తంగా విస్తృతప్రచారం జరుగుతుందన్నారు. బీజేవైఎం నాయకులు కార్యకర్తలందరూ అట్టి ప్రచారంలో భాగస్వామ్యం కావాలన్నారు. అలాగే కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత బీజేవైఎం శ్రేణులపై ఉందన్నారు. ప్రధానంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం యువత , అన్ని వర్గాల ప్రజల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం యువకులకు నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటనలు చేసి మోసం చేసిందన్నారు. అందుకే ఆ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ప్రజలంతా పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. బీజేవైఎం నాయకులు కార్యకర్తలు అంతా జరగబోయే ఎన్నికల కోసం, బిజెపి పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గెలుపుకోసం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఇట్టి సమావేశంలోజిల్లా ప్రధాన కార్యదర్శులు శశిధర్ రెడ్డి,శ్రీరాములు శ్రీకాంత్,జిల్లా ఉపాధ్యక్షులు సంపత్,అశోక్, సాయి,నికేష్,అనిల్,అజయ్,మహేష్,విజయ్,శశికుమార్,చైతన్య, ప్రశాంత్,అరుణ్,మనోజ్,ప్రదీప్,ప్రణయ్,రామకృష్ణ,సతీష్,కుమార్,అరవింద్,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యని

# అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

### - బోసుపల్లి ప్రతాప్, బచ్చిగళ్ల రమేష్



చండూర్ వెలుతురు ఏప్రిల్ 08: భారతీయ జనతా పార్టీ భువనగిరి పార్లమెంట్ పరిధిలో గల మునుగోడు నియోజకవర్గం చండూరు మండలంలో ఎస్సీ మోర్చా నియోజవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీల పాత్ర మరియు ఎస్సీ వాడాల నుండి అత్యధికంగా భారతీయ జనతా పార్టీకి ఓట్లు పడే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా పిలుపుమేరకు రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజవర్గాలలో ఎస్సీ సమ్మేళ నాలు నిర్వహించాలని దరిదాపు 5,000 మందికి తగ్గకుండా సమావేశాలు ఏర్పాటు చేయాలని పిలుపునివ్వడంతో భువనగిరి పార్లమెంట్లో గల ఏడు నియోజకవర్గాల్లో నియోజవర్గ సమావేశాలు జరిపి కార్యకర్తలు నాయకులను ఈ కార్యక్రమానికి అత్యధికంగా ఎస్సీ నాయకులను కార్యకర్తలను తీసుకొచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కేంద్రంలో మన ప్రియ తమ ప్రధాని నరేంద్ర మోడీ గారు చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలోకి తీసుకెళ్లి భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భువనగిరి పార్లమెంట్ కో ఇన్చార్జి ఉబ్బు బిక్షపతి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం వేణు, ఇరిగి ఆంజనేయులు, గ్యార గోపాల్, గ్యార గిరి, కట్ట కృష్ణ, మరియు మునుగోడు నియోజకవర్గం వివిధ మండలాల ఎస్సీ మోర్చా అధ్యక్షులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## తూప్రాన్ శ్రీ చైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



తూప్రాన్ వెలుతురు: తూప్రాన్ శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో యు.కే.జీ నుండి1వ తరగతిలో కి, పూర్వ ప్రాథమిక విద్య నుండి ప్రాథమిక విద్యకు, అలాగే ప్రాథమిక విద్య నుండి హైస్కూలు కు విద్యార్థులను ప్రమోషన్ చెందే ఈ గ్రాడ్యుయేషన్ వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నమెంట్ హాస్పిటల్ సివిల్ సర్జన్ డాక్టర్ గురుప్రసాద్ హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యార్థు లకు మెమెంటో పట్టాలను పంపిణీ చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్ పాల్ రామకృష్ణరావు, డీన్ నవీన్, సి ఇంఛార్జి అశోక్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.





# మేడిగడ్డ బ్యారేజ్‌కి తాత్కాలిక మరమ్మత్తులు చేసి రైతులకు నీరు అందించాలి: సిపిఎం

**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 8(వెలుతురు):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ ని సోమవారం సిపిఎం రాష్ట్ర నాయకులు సందర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ కి ఉదయం 11 గంటలకు ప్రాంతానికి చేరుకొని బ్యారేజ్ లోనీ కుంగిన పిల్లర్లను పరిశీలించారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ ని తాత్కాలిక మరమ్మత్తులు చేసి రైతులకు నీరు అందించాలని అన్నారు. సాగు నీటి ప్రాజెక్ట్ లో నే అత్యధిక ఖర్చు చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు అని, పేర్కొన్నారు. అలాంటి ప్రాజెక్టు భాగమైన మేడిగడ్డ కుంగిపోవడం దారుణమని మండిపడ్డారు. మేడిగడ్డ కుంగిపోవడం పై న్యాయ విచారణ చేసి బాధితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కరువు ఏర్పడుతుందని ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి తక్షణమే రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కొనసాగించాలా లేదా తర్వాత ఆలోచించండి కానీ ప్రస్తుతం రైతులకు నీరు అందించాలని ప్రభుత్వాన్ని సిపిఎం నాయకులు కోరారు.

# ఎన్నికల వేల సోదాలలో రూ.7.6 కోట్ల నగదు, బంగారు, ఆభరణాలను స్వాధీనం

**బెంగళూరు ఏప్రిల్ 8(వెలుతురు):**
పార్లమెంట్ ఎన్నికల సమయంలో కర్నాటక రాష్ట్రంలో భారీగా నగదు, బంగారాన్ని పట్టుకోవడం కలకలం సృష్టించింది. బళ్లారిలోని ఓ వ్యాపారి ఇంట్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సోదాలలో రూ.7.6 కోట్ల నగదు, బంగారు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది లెక్కలోనికి రాని



నగదు, ఆభరణాలుగా గుర్తించారు. రూ.5.6 కోట్ల నగదు, 103 కిలోల వెండి ఆభరణాలు, 68 వెండి కడ్డీలు, మూడు కిలోల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హవాలా మార్గంలోనే నగదును తీసుకొచ్చారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదాయపు పన్ను విభాగానికి తెలియజేస్తామని వ్యాపారి నరేష్ పేర్కొన్నారు. తరువాత ఐటి అధికారులు చర్యలు తీసుకోవచ్చని వివరించారు. కర్నాటకలో మొత్తం 28 లోక్ సభ స్థానాలకు రెండు దశల్లో పోలింగ్ జరుగుతోంది.

# కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ : జెపి నడ్డా


**న్యూఢిల్లీ ఏప్రిల్ 8(వెలుతురు):**
కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు సాగిస్తూ , సమాజం లోని అత్యధిక వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా సోమవారం తీవ్రంగా విమర్శించారు. రిజర్వేషన్



50 శాతం వరకు పెంచుతామని హామీ ప్రకటించడం ఎవరికి ప్రయోజనం కలిగిస్తుందో స్పష్టం చేయాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లింలీగ్ మేనిఫెస్టోలా ఉందని, స్వాతంత్ర్యం రాకముందు పాకిస్థాన్ కోసం సాగిన ఉద్యమం నాటి పరిస్థితులు కల్పిస్తుందని ప్రధాని మోడీ చేసిన విమర్శకు మద్దతు పలికారు. ప్రజలు అదేపనిగా తిరస్కరిస్తున్నా కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని, అదికారంపై ఉన్న అత్యాశతో దేశాన్ని విడదీస్తోందని ధ్వజమెత్తారు.

# ఓకే రోజు ముగ్గురు రైతుల ఆత్మహత్య

**మహబూబాబాద్ / పెద్దపల్లి / సిద్దిపేట ఏప్రిల్ 8 ((వెలుతురు):**
తెలంగాణలో మరో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దేశానికే అన్నం పెట్టే ముగ్గురు అన్నదాతలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా తోగుట మండలానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్ (48) నాలుగు ఎకరాల పొలంలో వరి పంట వేయగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో 7 బోర్లు తవ్వించాడు. రూ. 6 లక్షల వరకు అప్పు కావడంతో పొలం వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం లోని ఎర్రచక్ర తండాకు చెందిన జాటోత్ శ్రీను (40) మూడున్నర ఎకరాలలో మిరప, రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. మిరప సాగు కోసం రూ. 5 లక్షల వరకు అప్పు చేయగా సాగు నీరు లేక నష్టాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన ఉడుత సంతోష్ యాదవ్ (34) తనకున్న 8 ఎకరాలలో పత్తి సాగు చేస్తుండగా రూ. 35 లక్షల వరకు అప్పు చేశాడు. నీటి కొరత తెగుళ్లతో ఆశించిన పంట దిగుబడి రాలేదు. దీంతో, మనస్తాపం చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు..



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ ఉండరాదు

## ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 8 (వెలుతురు):**
కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వాలు తమ వద్దకు ఇటీవలి కాలంలో తరచు వస్తున్న ఉదంతాలపై సుప్రీంకోర్టు సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఒకరిపై ఒకరు ఘర్షణ పడడం కన్నా పరస్పర సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు పిలుపునిచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ ఉండరాదని కరవు సహాయ నిధుల విడుదల కోరుతూ కర్నాటక ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సంర్భంగా సుప్రీంకోర్టు సూచించింది. అనేక జిల్లాలలో కరవు నెలకొన్న దృష్ట్యా కర్నాటక ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందచేయలేదని పిటిషన్ పేర్కొంది.

కేంద్రం నిధులను విడుదల చేయకపోవడం తమ రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పిటిషన్‌లో కర్నాటక తెలిపింది. కరవు పరిస్థితిపై ఆరు నెలల క్రితం(గత ఏడాది అక్టోబర్) అంతర్ మంత్రివర్గ బృందం సమర్పించిన నివేదికపై కేంద్రం ఇప్పటివరకు ఎటువంటి



చర్యలు తీసుకోలేదని కూడా కర్నాటక ప్రభుత్వం తెలిపింది. ఎన్‌డిఆర్ఎఫ్ నిధులను ఆపడం వల్ల పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చిందని తెలిపింది. నివేదికను సమర్పించిన తర్వాత నెలరోజుల్లో దానిపై చర్యలు తీసుకోవలసి ఉంటుందని కర్నాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు.

కాగా..లోక్‌సభ ఎన్నికలు మరో 11 రోజుల్లో జరగనున్న తరుణంలో ఈ పిటిషన్ దాఖలు చేయడాన్ని కేంద్రం తప్పుపట్టింది. సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని సంప్రదించి ఉండవలసిందని కేంద్రం వాదించింది. వాద ప్రతివాదనలు విన్న జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం దీనిపై ఆదేశాలు తీసుకోవడానికి కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు రెండు వారాల వ్యవధిని ఇచ్చింది.

# బిజెపి పాలనలో కనుమరుగైపోతున్న పత్రికా స్వేచ్ఛ

## కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

**తిరువనంతపురం ఏప్రిల్ 8 (వెలుతురు):**
బిజెపి పాలనలో పత్రికా స్వేచ్ఛ కనుమరుగైపోయిందని, తమ పాలనను కీర్తించని మీడియా సంస్థలపై సంఘ్ పరివార్ నిరంతరం వేధింపులకు పాల్పడుతోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. సోమవారం నాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిబిసికి చెందిన ఇండియా వార్తావిభాగాన్ని మూసివేసినట్లు వెలువడిన వార్తలపై స్పందించారు. భారతదేశ విదేశీ పెట్టుబడుల నిబంధనలకు లోబడి లండన్‌కు చెందిన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బిబిసి) తన భారత విభాగాన్ని మూసివేసినట్లు వార్తలు వెలువడ్డాయని, ఆదాయం పన్ను శాఖ నుంచి నిత్యం వేధింపులు ఎదురవుతుండడంతో బిబిసి ఈ నిర్ణయాన్ని తీసుకోక తప్పలేదని విజయన్ చెప్పారు.

బిజెపి పాలనలో పత్రికా స్వేచ్ఛ కనుమరుగైపోయిందని, తమ పాలనను కీర్తించని మీడియా సంస్థలను సంఘ్ పరివార్ నిరంతరం టార్గెట్ చేస్తున్నట్లు కనపడుతోందని, ఇటువంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి రానున్న ఎన్నికలే గొప్ప అవకాశంగా తాము భావిస్తున్నామని విజయన్ తెలిపారు. మీడియాను కట్టడి చేయాలని నియంతలు ఎల్లప్పుడూ భావి



స్తారని, బిజెపి పాలనలో మళ్లీ ఎమర్జెనీ రోజులు రానున్నట్లు జరుగుతున్న పరిణామాలు సూచిస్తున్నాయని ఆయన చెప్పారు. తమకు విధేయంగా మీడియా ఉండాలన్నది బిజెపి అజెండాగా ఆయన అభిర్ణించారు. తమకు లొంగిపోని మీడియాను అణచివేయడానికి అటువంటి పాలకులు ప్రయత్నిస్తారని, బిబిసి విషయంలో పాలకుల దాడులు, బెదిరింపులు స్పష్టంగా కనిపించాయని ఆయన ఆరోపించారు.

2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచిలో భారత్ ర్యాంకింగ్ దిగజారిపోయిందని ఆయన ఆరోపించారు. పారిస్‌కు చెందిన రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ రూపొందించిన 2023 నివేదిక ప్రకారం భారత పత్రికా స్వేచ్ఛ మొత్తం 180 దేశాలలో 150 నుంచి 161వ ర్యాకుకు పడిపోయిందని ఆయన చెప్పారు. సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా వార్తలు రాసిన జర్నలిస్టులు, మీడియా సంస్థలపై ఏ రకమైన వేధింపులు జరుగుతున్నాయో దేశం యావత్తు చూసిందని విజయన్ చెప్పారు. ఢిల్లీ అల్లర్లపై 2020లో వార్తలు ప్రచురించిన కేరళలోని రెండు మీడియా సంస్థల లైసెన్సులను రద్దు చేసిన ఘటనను ఆయన గుర్తు చేశారు. కేరళలో ఈ నెల 26న ఒకే విడతలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి.

# జర్నలిస్టులను బెదిరించిన మాజీ సర్పంచ్ భర్త పి.శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలి


## తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ జిల్లా కలెక్టర్‌కి వినతి

**మేడ్చల్ మల్కాజ్గిరి ఏప్రిల్ 8(వెలుతురు):**
జర్నలిస్టులను బెదిరించిన మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. కీసర మండలం చీర్యాల గ్రామపంచాయతీ పరిధిలో వ్యవసాయం పంటలు పండించాల్సిన భూముల్లో అక్రమ నిర్మాణాలను మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. వివరణ కొరకై వెళ్లిన జర్నలిస్టులను చంపుతానని బెదిరించిన పి శ్రీనివాస్ పై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్, కమర్షియల్ భూములుగా కన్వర్ట్ చేయకుండా యదేచ్చిగా అక్రమంగా కమర్షియల్ షెడ్ లను నిర్మిస్తున్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండి



కొడుతున్నారు. దీనిపై వివరణ కోరిన జర్నలిస్టులను మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ పరుష పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించడాన్ని తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నది. చీర్యాల గ్రామంలో దాదాపు రెండు ఎకరాల వ్యవసాయ భూములో పెద్ద పెద్ద రెండు షెడ్లను నిర్మిస్తున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ షెడ్ల నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని వీటి నిర్మాణ ఆపమని నోటీసు జారీ చేసినప్పటికీ, నేనెవరి మాట వినను అంటూ నిర్మాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదంతా చీర్యాల గ్రామ మాజీ సర్పంచ్ భర్త పి శ్రీనివాస్ దగ్గరుండి నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు చెబుతున్నారు. కావున జిల్లా కలెక్టర్ ఈ విషయాలపై విచారణ జరిపించి, అక్రమ కట్టడాలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎడిటర్స్ అసోసియేషన్ నాయకులు జి హరిప్రసాద్, ఐ సత్యనారాయణ, భూపేంద్ర, డి అరుణ్ కుమార్, రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.















## మండుటెండల్లో

# వసంత వనాలు

**వేసవి వడగాలులు మొదలయ్యే వేళ.. వసంత సంతసం ఎక్కడుందంటారా? కాంక్రీట్ జంగిల్‌లో కాదండి.. కాస్త వనవిహారానికి వెళ్లి చూడండి. చెట్ల కొమ్మలపై పక్షుల కిలకిలలు.. గుబురు పొదల పైనుంచి వినిపించే భ్రమర నాదాలు.. అరణ్యాల్లో ఇదీ దృశ్యం. తరలి వచ్చిన వసంతంతో.. వనమంతా మనదంటా అనేలా ఉందిప్పుడు. వేసవి తాపానికి విరుగుడు మంత్రం వేయాలనుకుంటే.. వనవాసానికి సిద్ధమవ్వండి.**

దట్టమైన అడవి.. ఎత్తుపల్లాల అడవి.. అంతుబట్టని అడవి.. తూర్పు కనుమలకు వేదికైన తూర్పుగోదావరి జిల్లాలో వన సౌందర్యమిది. రాజమండ్రి నుంచి భద్రాచలం వెళ్లే దారిలోనే వస్తాయి రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాలు. వానల్లో మురిపించి.. చలిలో వణికించిన ఈ సుందర ప్రదేశాలు.. వేసవిలో సమశీతోష్ణంగా ఉంటాయి. పారే సెలయేళ్లు.. ఎత్తయిన కొండలు, వాటి నుంచి జాలువారే జలపాతాలు, నిండా పచ్చదనంతో ఈ అడవి.. విరిసిన వెన్నెల్లా అలరిస్తుంది. అందుకే వేసవి విహార కేంద్రాల్లో ఈ ప్రాంతాలు చోటు దక్కించుకున్నాయి.

## రంపచోడవరం

రంపచోడవరం అటవీ ప్రాంతం వారాంతపు నెలవుగా ప్రాచుర్యం పొందింది. ఇక్కడికి కూసంత దూరంలో రంపా జలపాతం ఉంటుంది. రంపచోడవరం నుంచి జలపాతానికి కాలినడకన వెళ్తుంటారు. దట్టంగా ఎదిగిన చెట్ల మధ్యలో నుంచి ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తూ ముందుకెళ్తే.. జలపాతం గలగలలు చెవిన పడతాయి. జలపాతం చూడాలంటే రూ.10 చెల్లించి టికెట్ తీసుకోవాలి. ఇంకాస్త ముందుకెళ్తే కొండ పైనుంచి.. రాళ్ల మీదుగా జాలువారే జలధారలు కనులకు విందు చేస్తాయి. మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. జలపాతం ముందున్న మడుగులో జలకాలాడుతూ.. కేరింతలు కొడుతూ..ప్రయాణ బడలికను మరచిపోతారు. పర్యాటకులు తమ వెంట తెచ్చుకున్న ఆహారపదార్థాలను జలపాతం పరిసరాల్లో కూర్చొని ఆరగిస్తారు. ఈ కొండకోనల్లోనే ప్రాచీనమైన మల్లికార్జునస్వామి ఆలయం ఉంది.

**ఎలా వెళ్లాలి?**

* రాజమండ్రి నుంచి రంపచోడవరం 60 కిలోమీటర్లు. నేరుగా బస్సులో గాని సొంత వాహనాల్లో గాని వెళ్ల వచ్చు. రంపచోడవరం నుంచి మారేడుమిల్లికి 26 కిలోమీటర్లు. భద్రాచలం నుంచి 115 కిలోమీటర్లు. భద్రాచలం నుంచి నేరుగా బస్సు సౌకర్యం ఉంది.

ఆలయ పరిసరాలు పచ్చదనంతో పరవశింపజేస్తాయి. కొండల మధ్యనున్న ఆలయాన్ని 14వ శతాబ్దంలో నాగవంశీయులు నిర్మించారని చెబుతారు. కొండ దిగువన ఆలయం ఉంటే.. కొండపైన స్వయంభువుగా వెలసిన స్వామి దర్శనమిస్తాడు. ఇక్కడి నుంచి మారేడుమిల్లికి వెళ్లే దారిలోనే భూపతిపాలెం రిజర్వాయర్ ఉంది. కొండల నడుమ ఉన్న ఈ జలాశయం సౌందర్యం గురించి ఎంత వర్ణించినా తక్కువే. అంతటి అందమైన జలాశయాన్ని అణువణువూ ఆస్వాదించేలా బోటు షికారు కూడా అందుబాటులో ఉంది. రూ.50 (ఒక్కొక్కరికి) చెల్లించి ఎంచక్కా బోటులో షికారు చేయవచ్చు.

## మారేడుమిల్లి

రంపచోడవరం సమీపంలో ప్రకృతి సౌందర్యానికి ఆలవాలం మారేడుమిల్లి. అడవి అందాలను దగ్గరగా ఆస్వాదించాలంటే ఇక్కడికి రావాల్సిందే. పచ్చటి ప్రకృతి, ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడికి పర్యాటకులను క్యూ కట్టేలా చేస్తున్నాయి. అటవీశాఖ ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తోంది. మారేడుమిల్లి నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిలో ఎన్నో సందర్శనీయ స్థలాలు ఉన్నాయి. వేలరకాల మొక్కలతో తీర్చిదిద్దిన 'నందనవనం' పిల్లలను, పెద్దలను అలరిస్తుంది. అడవి తల్లి ఒడిలో దొరికే అరుదైన వనమూలికల సంరక్షణ కేంద్రం మరో ఆకర్షణ. 'వాలిసుగ్రీవ వనమూలిక కేంద్రం'లో 203 రకాల వనమూలికలను చూడొచ్చు. సహజ జలపాతాలకు ఈ ప్రాంతం పెట్టింది పేరు. జలతరంగిణి, అమృతధార, మదన్‌కుంజ్ జలపాతాలు ఇక్కడ ఉన్నాయి. వేసవిలో జలధారల వేగం తగ్గినా.. అడవిలో చల్లదనం తగ్గలేదు. ప్రశాంతత చెదరలేదు. ఆహ్లాద వాతావరణంలో తేడా లేదు.

**బసకు బోలెడు..**

మారేడుమిల్లిలో 'వనవిహారి' ఉడెన్ కాటేజీలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఏసీ, నాన్‌ఏసీ అందుబాటులో ఉన్నాయి. ఏసీ గదులకు రోజుకు రూ.2,500, నాన్ ఏసీ అయితే రూ.1,500 అద్దె వసూలు చేస్తున్నారు. ఇక్కడి కొండలపై 'ప్రీ ఫాబ్రికేటెడ్' కాటేజీలు కూడా బసకు అనుకూలంగా ఉంటాయి. ఇక్కడే 'హిల్‌మైనా' రెస్టారెంట్ ఉంది.

**ప్రకృతి ఒడిలో..**

మారేడుమిల్లిభద్రాచలం ప్రధాన రహదారిలో సుమారు 10 కిలోమీటర్ల దూరంలో వాలమూరు గ్రామం దగ్గర 'జంగిల్‌స్టార్ నేచర్‌క్యాంప్' ఏర్పాటు చేశారు. మూడువైపులా పాములేరు వాగు సుందరంగా ప్రవహిస్తుంటుంది. మరోవైపు పచ్చగా విస్తరించి ఉన్న కొండలు. రాత్రిళ్లు మనోహరంగా ఉంటుంది. ఈ వాగులో మొసళ్లుంటాయి. కాబట్టి నీళ్లలోకి వెళ్లే ప్రయత్నం చేయకండి. నేచర్‌క్యాంప్‌లోనూ కాటేజీలు అందుబాటులో ఉన్నాయి. అద్దె రూ.4,000 (ఇద్దరికి). ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం శాకాహార భోజనం, సాయంత్రం ఉపాహారం, రాత్రి మాంసాహార భోజన సదుపాయం కల్పిస్తారు.

# పులికాట్‌లో విహంగామా

ఒంటికాలుపై తపస్సు చేసే కొంగలు.. వంపు తిరిగిన పొడవాటి మెడ, ఎర్రనిముక్కుతో కనువిందు చేసే ఫ్లెమింగోలు.. సంచిని వేలాడేసుకున్న గొంతుతో మిడిసిపడే గూడబాతులు.. ఒకటా.. రెండా.. 152 రకాల పక్షులు విడిది కోసం ప్రళయ కావేరి (పులికాట్ సరస్సు)కి చేరుకున్నాయి. నేలపట్టు, వెదురుపట్టు ప్రాంతాల్లోనూ వీటి కిలకిలారావాలు వినిపిస్తుంటాయి. విదేశాల నుంచి గగన మార్గంలో అతిథులు విచ్చేసిన సందర్భంగా పండగ చేసుకోకుంటే ఎలా? అందుకే ఫ్లెమింగో పండగకు రంగం సిద్ధమైంది.

నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లో 600 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఏటా అక్టోబర్ వచ్చిందంటే చాలు ఈ ఉప్పునీటి సరస్సు విదేశీ పక్షులకు ఆలవాలంగా మారిపోతుంది. అక్టోబర్ నుంచి జనవరి మాసాంతం వరకు విదేశీ పక్షులు అలరిస్తాయి. శీతాకాలంలో చలిని తట్టుకోలేక.. దక్షిణ అమెరికా, ఐరోపా ఖండాల్లోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తాయివి. నాలుగు నెలల పాటు పులికాట్ సరస్సుతో పాటు సమీపంలోని నేలపట్టు, వెదురుపట్టులో హాయిగా సేద తీరుతాయి. గూళ్లు కట్టి, గుడ్లు పెట్టి, వాటిని పొదిగి.. శీతాకాలం ముగిసిన తర్వాత పిల్లలతో కలిసి స్వస్థలాలకు ఎగిరిపోతాయి.

విదేశీ పక్షుల రాకతో ఈ ప్రాంతమంతా సందడి సందడిగా ఉంటుంది. ఈ సందర్భాన్ని మరింత ఉత్సాహంగా మార్చేందుకు 2001లో పక్షుల పండగను నిర్వహించాలని నిర్ణయించారు అప్పటి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్. దానికి సముద్రపు రామచిలుక (ఫ్లెమింగో) పక్షి పేరిట 'ఫ్లెమింగో ఫెస్టివల్' అని నామకరణం చేశారు. ఆనాటి నుంచి రెండు సంవత్సరాలు మినహా ఈ పండగ జరుగుతూ వస్తోంది.



2014 నుంచి 'ఫ్లెమింగో ఫెస్టివల్'ను రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించింది. పక్షుల అందాలు చూసేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసే స్టాల్స్‌తోపాటు, ఆటల పోటీలు, సాయంత్రం నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**ఇవీ చూడొచ్చు..**

* సూళ్లూరుపేట నుంచి 25 కిలోమీటర్ల దూరంలో భీమునివారిపాళెం ఓడరేవు ఉంటుంది. బోటింగ్‌కు అనుకూలం. పడవ పందేలు కూడా జరుగుతుంటాయిక్కడ.
* పనిలో పనిగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించవచ్చు. అధికారుల అనుమతి తప్పనిసరి. సూళ్లూరుపేటలో చెంగాళమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి. ఈ ఆలయానికి తలుపులు ఉండవు. 24 గంటలూ.. దర్శనం లభిస్తుంది.
* సూళ్లూరుపేటకు మూడు కిలోమీటర్ల దూరంలో మన్నారుపోలూరులో అలఘుమన్నారు కృష్ణస్వామి ఆలయం ఉంది. ద్వాపరయుగంలో శమంతకమణి కోసం శ్రీకృష్ణుడికి, జాంబవంతునికి మధ్య మల్ల యుద్ధం ఇక్కడే జరిగిందని స్థలపురాణం.



# ఏటూరునాగారం

ఎండాకాలంలో ఎక్కడికి వెళ్లాలన్నా వెనకడుగు వేస్తాం. ఉష్ణతాపం ఇంటిపట్టునే ఉండమని హడలిస్తుంటుంది. ఆ హెచ్చరికలను పెడచెవిన పెట్టి.. కాస్త ధైర్యం చేసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏటూరునాగారం అభయారణ్యంలోకి ప్రవేశించండి.

ఎండకన్నెరగకుండా మానులే మీకు గొడుగు పడతాయి. వడగాలి తగలకుండా పచ్చని చెట్లు అడ్డుగా నిలుస్తాయి. దట్టమైన అడవి మధ్యలో తాడ్వాయి దగ్గర అటవీశాఖ ఏర్పాటు చేసిన వనకుటీరాలు.. చల్లని నీడనిస్తాయి.

**ఎలావెళ్లాలి?**

* వరంగల్ నుంచి తాడ్వాయికి 95 కిలోమీటర్లు. బస్సుల్లో, ప్రైవేట్ ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి.
* హైదరాబాద్ నుంచి ఏటూరునాగారం వెళ్లే బస్సులు తాడ్వాయి మీదుగానే వెళ్తాయి.

**సైకిల్ సవారీ**

ఈ అరణ్యంలో అనుక్షణం ఆనందంగా గడిచిపోతుంది. ఉదయాన్నే.. చెట్ల నుంచి తొంగిచూసే సూర్యుడు.. మనసును ఉల్లాసపరుస్తాడు. వనవిహారానికి పదండి.. పదండి.. అంటూ అడవంతా తన కిరణాలను ప్రసరింపజేస్తాడు. ఈ వనంలో సైకిల్ సవారీ కోసం ప్రత్యేకమైన ట్రాక్ కూడా ఉంది. సైకిళ్లు అద్దెకు లభిస్తాయి. అరగంటపాటు స్వచ్ఛమైన గాలి పీలుస్తూ.. సైక్లింగ్ చేస్తూ.. దిక్కులు చూడండి. ఓ దిక్కున జింకలు, ఇంకోదిక్కున కుందేళ్ల ఉరుకులు.. కనిపించొచ్చు. అలా అలా తిరిగేసి కుటీరానికి చేరుకొని.. స్నానం పూర్తి చేసుకొన్నాక.. వేడి వేడి టిఫిన్ పిలుస్తుంది. అల్పాహారం పూర్తయ్యాక అసలు విహారం మొదలవుతుంది. అడవిలోని అందాలన్నీ చూపించడానికి గైడ్ ఉంటారు. అభయారణ్యం విశేషాలన్నీ వివరిస్తారు. దగ్గరుండి మరీ వనంలోని వింతలన్నీ తిప్పి చూపిస్తాడు. ఆదిమమానవుల కాలంనాటి దామెరవాయి రాక్షస గుహలు చూసి ఆశ్చర్యపోవాల్సిందే. చిక్కటి అడవిలో ఉన్న బ్లాక్‌బెర్రీ ద్వీపం అందాలతో పాటు అక్కడే బర్డ్‌వాచింగ్ ఆస్వాదించవచ్చు. ఇక్కడి పర్యావరణ అధ్యయన కేంద్రం కూడా దర్శనీయ స్థలం.





**కుటీరాల్లో కులాసాగా..**


ఇటీవల అభయారణ్యంలో తాడ్వాయి దగ్గర ఆరు కుటీరాలు ఏర్పాటు చేశారు. వీటి అద్దె రూ.2,000 (ఇద్దరికి) సాయంత్రానికి ఇక్కడికి చేరుకుంటే.. రాత్రంతా కుటీరాల్లో కులాసాగా బస చేయవచ్చు. భోజన సదుపాయం కూడా ఉంది. మర్నాడు ఉదయాన్నే అడవంతా చుట్టేయొచ్చు. మళ్లీ సాయంత్రం తిరుగు ప్రయాణం అవ్వొచ్చు. వనకుటీరాలపై వెబ్‌సైట్‌ను కూడా రూపొందించారు. త్వరలో ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించనున్నారు. వారాంతాల్లో హైదరాబాద్ నుంచి యువతీయువతులు బృందాలుగా ఏటూరునాగారం అరణ్యానికి చేరుకుంటున్నారు. ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ వంటి ఈవెంట్లతో రెండు రోజులు హాయిగా గడిపేస్తున్నారు. ఈ వేసవిలోనే జంగిల్ సఫారీ కూడా ప్రవేశపెట్టే యోచనలో ఉన్నారు అధికారులు. ఇప్పటికే పర్యాటక కేలండర్ పేరుతో జయశంకర్ జిల్లాలో అటవీశాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. త్వరలో మూడు ప్యాకేజీలు ప్రవేశపెట్టనున్నారు. హైదరాబాద్‌తోపాటు, తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు ఇటుగా వస్తున్నారు. మనమూ వెళ్లిపోదాం. అడవిలో హాయిగా సేదతీరుదాం.



# బర్త్‌డే బాయ్ బన్నీ.. వెల్లువెత్తిన విషెస్

## పుష్ప-2 నుంచి అల్లు గెటప్ విడుదల

నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు అన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలిపారు. ఇప్పటికే టాలీవుడ్ అగ్ర నటుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు బావ అంటూ బన్నికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్‌కు ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు.హ్యాపీ బర్త్ డే బన్నీ.. జాతీయ అవార్డుగ్రహీత, చక్కటి అభినయ కౌశలం కలిగిన కథానాయకుడు అల్లు అర్జున్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భవిష్యత్తులో బన్నీ మరిన్ని పురస్కారాలు, విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ పవన్ కళ్యాణ్ తెలిపాడు. నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులతో పాటు పలువురు సెలబ్రిటీలు బన్నికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ పుష్ప.. ది రూల్. ఈ సినిమాకు లెక్కల మాస్టార్ సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నామరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ సినిమా నుంచి నేడు బన్ని బర్త్ డే కానుకగా టీజర్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ విడుదల చేశారు. గంగమ్మ తల్లి జాతరలో అమ్మవారి గెటప్ లో అల్లు అర్జున్ ఫైట్ సీన్‌తో ఫుల్ యాక్షన్ ప్యాక్ట్‌డ్‌గా సాగింది ఈ టీజర్. సోమవారం అల్లు అర్జున్ పుట్టినరోజు పురస్కరించుకుని చిత్రబృందం స్పెషల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. 'పుష్ప ది రూల్' టీజర్ విడుదల చేసింది. సినిమాలో కీలకంగా సాగే జాతర సన్నివేశాలతో ఇది సిద్ధమైంది. మాస్ అవతార్‌లో బన్నీ లుక్స్, యాక్షన్ సన్నివేశాలు ఈలలు వేయించేలా ఉన్నాయి. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన చిత్రం 'పుష్ప ది రైజ్'. 2021లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఎర్రచందనం కూలీ నుంచి స్మగ్లింగ్ సిండికేట్‌కు నాయకుడిగా పుష్ప ఎలా ఎదిగాడని మొదటి భాగంలో చూపించారు. మరి, సిండికేట్‌కు లీడర్ అయ్యాక పుష్పకు ఎదురైన సవాళ్లు ఏమిటి? మంగళం శ్రీను, భన్వర్ సింగ్ షెకావత్, దాక్షాయణి నుంచి ఎలాంటి ప్రమాదం పొంచి ఉందనే అంశాలతో 'పుష్ప ది రూల్' సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ తెరకెక్కిస్తున్న సీక్వెల్ ప్రాజెక్టులో కన్నడ భామ రష్మిక మందన్నామరోసారి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. శ్రీవల్లిగా డీగ్లామరైజ్డ్ రోల్‌లో కనిపించనుంది . పార్టు 2లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# అల్లుకు చిరు విషెస్

నేడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు అన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. ఇప్పటికే టాలీవుడ్ అగ్ర నటుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు బావ అంటూ బన్నికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. తాజాగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్‌కు ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. హ్యాపీ బర్త్ డే బన్నీ.. జాతీయ అవార్డుగ్రహీత, చక్కటి అభినయ కౌశలం కలిగిన కథానాయకుడు అల్లు అర్జున్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భవిష్యత్తులో బన్నీ మరిన్ని పురస్కారాలు, విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ పవన్ కళ్యాణ్ తెలిపాడు. మరోవైపు చిరంజీవి కూడా అల్లు అర్జున్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. పుట్టినరోజు శుభాకాంక్షలు డియర్ బన్నీ. ఈ సంవత్సరం మీకు సంతోషం, సక్సెస్‌లతో నిండలాని కోరుకుంటున్నాను. పుష్ప టీజర్ సూపర్‌గా ఉంది అంటూ రాసుకోచ్చాడు.

# మంచు కన్నప్పలో ప్రభాస్ కీ రోల్



టాలీవుడ్ నటుడు మంచు విష్ణు హీరోగా వస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప' . మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బ్జడెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. రీసెంట్‌గా మహాశివరాత్రి కానుకగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ కూడా వదిలారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో విష్ణు జలపాతం నుంచి ఎంట్రీ ఇస్తూ.. బాణంను ఎక్కుపెట్టినట్లు కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతుండగా.. తాజాగా మూవీకి సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో ఇప్పటికే మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్న విషయం తెలిసిందే. తాజాగా మరో అగ్రహీరో ఈ సినిమాలో నటించబోతు న్నాడు. బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటించ నున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై మేకర్స్ నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్‌లో లాంగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న చిత్ర బృందం ఇండియాకు తిరిగొచ్చింది. తాజా సమాచారం ప్రకారం ఏప్రిల్‌లో మొదలయ్యే తాజా షెడ్యూల్‌లో ప్రభాస్ జాయిన్ కాబోతున్నట్లు తెలిసింది.


## నిత్యామీనన్‌కు

# బర్త్‌డే విషెస్

మలయాళ బ్యూటీ నిత్యామీనన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తొలి సినిమా 'అలా మొదలైంది' తోనే తిరుగులేని పాపులారిటీ తెచ్చుకున్న ఈ భామ ఆ తర్వాత 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే', 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' ఇలా బ్యాక్ టు బ్యాక్ హిట్లతో అనతికాలంలోనే అగ్ర కథానాయికగా పేరు సంపాదించుకుంది. రీసెంట్‌గా 'భీమ్లానాయక్', 'తిరు' సినిమాలతో మళ్లీ తిరిగి హిట్ ట్రాక్‌లోకి వచ్చేసింది. నిత్యామీనన్ పుట్టినరోజు సందర్భంగా నిత్యాకు సోషల్ మీడియా వేదికగా ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు.

ఇదిలావుంటే నిత్యా పుట్టినరోజు సందర్భంగా తాను నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ నుంచి మేకర్స్ అప్‌డేట్ ఇచ్చారు. నిత్యామీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డియర్‌ఎక్స్. ఈ సినిమా కోలీవుడ్ దర్శకురాలు కామిని దర్శకత్వం వహిస్తుండగా.. బాస్క్ టైమ్ థియేటర్, పోష్టర్ మీడియా నెట్‌వర్క్ బ్యానర్లపై, ఆదిత్య అజయ్ సింగ్, రామ్కి సంయక్తంగా నిర్మిస్తున్నారు.

ఈ మూవీ నుంచి నిత్యా పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇక ఈ ఫస్ట్ లుక్‌లో పెళ్లి కూతురు గెటప్‌లో నిత్యా కనిపిస్తూ ఒకవైపు డ్రింక్.. మరోవైపు ఫోన్ పట్టుకుని ఉంది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రానున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతుంది. వినయ్ రాయ్, నవదీప్, ప్రతీక్ బబ్బర్, దీపక్ పరంబోల్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.






## రాజమండ్రిలో గేమ్‌ఛేంజర్ షెడ్యూల్


రామ్‌చరణ్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే! పొలిటికల్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ ముగింపు దశలో ఉంది. ఈ సినిమాకు సంబంధించి తాజా అప్‌డేట్ వచ్చింది. ఈ నెల మూడో వారం నుంచి రాజమండ్రిలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుందని చిత్ర వర్గాల నుంచి సమాచారం. కొద్దిరోజులు అక్కడ చిత్రీకరణ చేసుకున్నాక విశాఖపట్టణంలోనూ కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

# యానిమల్ కోసం ఎంతో కష్టపడ్డా: రష్మిక

'యానిమల్'లో గీతాంజలి పాత్రలో తనదైన నటనతో అభిమానుల్ని మెప్పించింది రష్మిక. విమర్శలతో పాటు ప్రశంసలు అందుకున్న ఈ చిత్రంలో కర్వాచౌత్ పండగ సందర్భంలో వచ్చే సన్నివేశంలో డైలాగులు సరిగ్గా చెప్పలేదంటూ ఆమె విమర్శలు



ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమెపై వస్తోన్న ట్రోల్స్ గురించి స్పందిస్తూ... 'యానిమల్'లో కొన్ని సన్నివేశాల్లో నా ముఖం, నటన, డైలాగ్ చెప్పే విధానం బాగాలేదని విమర్శిస్తున్నారు. అందులో కర్వాచౌత్ సన్నివేశం గురించి ఎక్కువ ట్రోల్స్ చేస్తున్నారు. కానీ.. ఆ సన్నివేశం ఈ సినిమాకే ప్రత్యేకం. ఒక్క సీన్‌లోనే ఎన్నోరకాల హావభావాల్ని పలికించాల్సి వచ్చింది. దానికోసం నేనెంత కష్టపడ్డానో నాకు మాత్రమే తెలుసు. అందులో నా నటన చూసి సెట్లో, థియేటర్లలో మంచి ప్రశంసలు వచ్చాయి. విచిత్రమేంటంటే.. 9 నిమిషాల సీన్‌లో 10 సెకన్ల డైలాగ్ బాగాలేదని నన్ను ట్రోల్స్ చేశారు. ఇలాంటి వాటిని నేను పట్టించుకోను. ఎలాంటి సన్నివేశాలకి ఏ విధంగా నటించాలో నాకు తెలుసు. అయినా ఎవరి అభిరుచి వాళ్లది. అందరికీ అన్నీ నచ్చాలని లేదు కదా' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక. ప్రస్తుతం 'పుష్ప 2', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రీకరణలో ఉందామె.




## ఐపీసీ పార్టీ మల్కాజిరి ఎంపీ అభ్యర్థిగా ఉదయలక్ష్మీ

### ఐపీసీ పార్టీ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్

**హైదరాబాద్ ఏప్రిల్ 8(వెలుతురు):**
ఐపీసీ పార్టీ మల్కాజిరి ఎంపీ అభ్యర్థిగా పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, వికలాంగ్ జంగ్ విభాగం జాతీయ అధ్యక్షురాలు శివలంక నాగ ఉదయలక్ష్మిని బరిలో నిలువుతున్నట్లు ఐపీసీ పార్టీ జాతీయ అధ్యక్షులు కెబి. శ్రీధర్ ప్రకటించారు. ఆబిడ్స్ లోని పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ.. మాతృప్రేమతో పరిపాలన తమ పార్టీ లక్ష్యం అన్నారు. ఉదయలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేసారు.. అనంతరం ఉదయలక్ష్మీ మాట్లాడుతూ.. భారత రాజకీయ పార్టీ చరిత్రలో ఏ పార్టీ కూడా దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించలేదని అన్నారు. దివ్యాంగులకు కేవలం పెన్షన్లు మాత్రమే ఇస్తే సరిపోదు అన్నారు. తనను గెలిపిస్తే అత్యంత సామాజిక బలహీన వర్గమైన దివ్యాంగులను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తామన్నారు. వికలాంగులం ప్రభుత్వంలో భాగస్వామ్యం అవుతాం అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పార్టీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వాసుదేవ రావు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు నేమాని భాస్కర్ నేత, యాదవ్, ఆఫీస్ ఇంచర్గే కొండల్ రావు, పిఅర్ఓ సరిత, నవీనరాణి, ఆవుల అల్లాజీ నాగభూషణం పాల్గొన్నారు.

## మాల్దీవ్స్ మంత్రి మరియం షియున సోషల్ భారత్‌కు క్షమాపణలు


**న్యూ డిల్లీ ఏప్రిల్ 8 (వెలుతురు):**
సస్పెండయిన మాల్దీవ్స్ మంత్రి మరియం షియున సోషల్ మీడియాలో క్షమాపణలు తెలిపారు. భారత త్రివర్ణ పతాకాన్ని కించపరిచే ఇమేజ్ ను ఆమె ఇదివరలో షేర్



చేశారు. అది ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఆ పోస్ట్ ను తర్వాత డిలీట్ చేశారు. మాల్దీవుల్లో ప్రతిపక్షం దీనిపై రచ్చరచ్చ చేసింది. అక్కడ జాతీయ పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి.మరియ షియును మాల్దీవ్స్ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు అధికార పార్టీకి చెందిన వ్యక్తి. ఆమె సోషల్ మీడియా నుంచి తన పోస్ట్ ను తొలగించడమే కాకుండా ఇప్పుడు ప్రజలన మద్దతును కోరుతున్నారు. 'ఎండిపి మద్దతును కోల్పోతోంది.మాల్దీవ్స్ ప్రజలు కూడా ఆ పార్టీతో పడిపోవాలనుకోవడం లేదు'అని పోస్ట్ పెట్టారు.

## పడవ మునిగి 91 మంది మృతి

**మొజాంబిక్ ఏప్రిల్ 8(వెలుతురు):**
మొజాంబిక్ సముద్రంలో పడవ మునిగి 91 మంది మృతి చెందిన సంఘటన ఆఫ్రికా దేశంలోని మొజాంబిక్ ప్రాంతంలో జరిగింది. నింపులా ప్రావిన్స్ ఐలాండ్‌కు



సమీపంలో 130 మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ సముద్రం మధ్యలోకి వెళ్లిన తరువాత తిరగబడడంతో 91 మంది దుర్మరణం చెందారు. పరిమితి మించి ప్రయాణికులు ఎక్కడంతోనే పడవ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. అలలు పెద్ద ఎత్తున ఎగసిపడుతుండడంతో సహాయక చర్యలు చేపట్టడానికి ఇబ్బంది కలుగుతోంది. మృతులలో చిన్న పిల్లలు ఎక్కువగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. గత ఆరు నెలల నుంచి సౌత్ ఆఫ్రికాలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధులలో ప్రతి 15000 మందిలో 32 మంది మృత్యువాత పడుతున్నారు.

## యూట్యూబర్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు.. బెయిల్ పునరుద్ధరణ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 8(వెలుతురు):** లోక్ సభ ఎన్నికలకు ముందు యూట్యూబ్‌లో ఆరోపణలు చేసే ప్రతి వ్యక్తిని కటకటాల వెనక్కి నెడుతూ పోతే ఎంత మందిని జైళ్లో పెట్టాల్సి వస్తుందో ఊహించండి అంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య చేసింది. తమిళనాడులో సత్తాయ్ అనే యూట్యూబ్ ఛానెల్ హెూస్ట్ దురై మురుగన్ బెయిల్ పిటిషన్ పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్య చేసింది.దురైమురుగన్ బెయిల్ పిటిషన్ పై న్యాయమూర్తులు అభయ్ ఎస్. ఓకా, ఉజ్జల్ భుయాన్ లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ధర్మాసనం యూట్యూబర్ కు మంజూరయిన బెయిల్ ను పునరుద్ధరించింది. అదే సందర్భంలో రాష్ట్రం తరఫున వాదించిన సీనియర్



న్యాయవాది ముకుల్ రోహత్గీని ఉద్దేశించి న్యాయమూర్తి ఓకా కీలక సవాలును లేవనెత్తారు.ఎన్నికలకు ముందు, మేము యూట్యూబ్ లో ఆరోపణలు చేసే ప్రతి ఒక్కరినీ కటకటాల వెనక్కి నెట్టడం ప్రారంభిస్తే, ఎంత మందికి జైలు శిక్ష పడుతుందో ఊహించండి అన్నారు. గతంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పై దురైమురుగన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు అరెస్టు చేశారు. తర్వాత అతడు బెయిల్ పై బయటికొచ్చారు. కానీ మద్రాస్ హైకోర్టు అతడి బెయిల్ ను రద్దు చేసింది. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నేడు జరిగిన విచారణలో కోర్టు ఆయనకు బెయిల్ ను పునరుద్ధరించింది.

# సుంతుష్టీకరణ నినాదాల మీద పరిపాలన సాగించిన కాంగ్రెస్

### ఒక వర్గం కోసమే ఆ పార్టీ ఉన్నట్లుగా ఆపార్టీ వ్యవహరిస్తోంది

### ఆర్టికల్ 370 అధికరణం రద్దును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకించింది

### I.N.D.I.A అవినీతి నాయకుల కూటమి

### మహిళలంటే కాంగ్రెస్‌కు వివక్ష

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

**హైదరాబాద్ ఏప్రిల్ 8(వెలుతురు):**
స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సుంతుష్టీకరణ విధానాల యొక్క నినాదాల మీద పరిపాలన కొనసాగిస్తూ, ఒక వర్గం కోసమే ఆ పార్టీ ఉన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవుదూడ గుర్తును వదులుకుని చేతి గుర్తును ఎంచుకోవడమే లౌకికవాదం, సంతుష్టీకరణకు నిదర్శనమని దుయ్యబట్టారు. భారతదేశంలో కశ్మీర్ ను అంతర్భాగం చేసే ఆర్టికల్ 370 అధికరణం రద్దును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకించిందని సూటిగా ప్రశ్నించారు. సుప్రీంకోర్టు సమ్మతించిన యూనిఫామ్ సివిల్ కోడ్ ను కూడా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ విషయంలో పాకిస్తాన్ చెప్పిన మాటలనే రాహుల్ గాంధీ మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మతపీడనకు గురై భారత్ కు తరలివచ్చిన శరణార్థుల కోసం తీసుకొచ్చిన సీఏఏను కాంగ్రెస్ సమర్థించకపోవడానికి మైనారిటీ సంతుష్టీకరణ కోసమేనంటూ ఎద్దేవా చేశారు. అయోధ్యలో భవ్యమైన, దివ్యమైన రామమందిరం నిర్మిస్తే.. ప్రాణప్రతిష్ట నాడు నరేంద్ర మోదీ గారు వెళ్తున్నారనే కారణంతో ఆలయాన్ని సందర్శించలేదనుకుంటే.. మరి ఆ తర్వాత ఈనాటి వరకు రాహుల్ గాంధీ రామ్ లల్లాను ఎందుకు దర్శించలేదంటూ ప్రశ్నించారు. ఇదంతా ఒక వర్గాన్ని బుజ్జగించడం కోసమేనని దుయ్యబట్టారు. ముస్లింలీగ్ తో పొత్తు పెట్టుకుంది కూడా మైనారిటీ సంతుష్టీకరణ కోసమేనని నిప్పులు చెరిగారు. ఇవాళ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని తూర్పారబట్టారు.

**I.N.D.I.A అవినీతి నాయకుల కూటమి :**

విపక్ష పార్టీల %I.N.D.I.A కూటమి విషయంలో కాంగ్రెస్ ను తూర్పారబట్టారు. అసలు UPA ఉండగా I.N.D.I.A ఎందుకంటూ ప్రశ్నించారు. I.N.D.I.A కూటమిని ప్రారంభించిన నితీష్ కుమార్ లాంటి నాయకులే వైదొలగారని, మరోవైపు మమతా లాంటి వారి అంటీముట్టనట్లుగానే ఉన్నారని అన్నారు. అలాంటప్పుడు I.N.D.I.A ఇంకెందుకంటూ చురకలు అంటించారు. విపక్ష పార్టీల కూటమిలో ఉన్నవాళ్లంతా అవినీతి కేసుల్లో విచారణను ఎదుర్కొన్నవాళ్లేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులకు నిజంగా దేశభక్తి ఉన్నట్లయితే, సర్వధర్మం కోసమే అయినట్లయితే I.N.D.I.A



కాదు.. భారత కూటమి అని పెట్టుకునేవారని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా ఎన్నికల ప్రచారం గురించి మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ..... ఇటీవలే ఎన్నికల ప్రచారం ప్రారంభమైందని, ప్రశాంత్ కిషోరే భారతీయ జనతా పార్టీకి 300 సీట్లు వస్తాయని ఒప్పుకున్నాడని, బీజేపీ దే అధికారమని చెప్పారని.... మరికొన్ని రోజులైతే బీజేపీ కి 370కి పైగా సీట్లు వస్తాయని, 400 సీట్లతో ఎన్డీయే విజయం సాధిస్తుందని ఆయనే ఒప్పుకుంటారంటూ చురకలు అంటించారు.

**మహిళలంటే కాంగ్రెస్‌కు వివక్ష :**

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తీసుకొచ్చిన మేనిఫెస్టోలో రోహింగ్యాల గురించి ప్రస్తావనే లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోకి వస్తున్న అక్రమ చొరబాటుదారులను తరమేస్తామని ఎందుకు చెప్పలేకపోయారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బస్సులతో పాటు మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లు, కాలేజీ బస్సుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుతో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల మహిళలు ఎంతో మంది హైదరాబాద్ లో నివసిస్తున్నారని, ఉచిత ప్రయాణానికి ఆధార్ ప్రామాణికంగా తీసుకోవడం వల్ల వారు నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పుడు ఆ నిష్పత్తికి అనుగుణంగా బస్సుల సంఖ్యను ఎందుకు పెంచడం లేదంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పట్ల వివక్ష వహిస్తోందని, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఓడించడం ఖాయమన్నారు.

గ్యారంటీలు అమలు చేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు.మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమని చెబుతున్న కాంగ్రెస్... మహిళల పట్ల ఎందుకు వివక్ష వహిస్తోందని ప్రశ్నించారు.మహిళలకు మెట్రో రైళ్లు, ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం లేదు.. నగరంలో తిరుగుతున్న స్కూళ్లు, కాలేజీ బస్సుల్లో అమ్మాయిలకు ఉచిత ప్రయాణం లేదు.. ఐటీ రంగానికి చెందిన బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం లేదు. అలాంటప్పుడు మహిళలందరికీ ఉచిత ప్రయాణమని ఎలా చెప్పుకుంటారన్నారు.మహిళలకు ఉచిత ప్రయాణం విషయంలో కాంగ్రెస్.. ఆ పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని ప్రబాకర్ డిమాండ్ చేసారు.మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే.. మెట్రో రైళ్లలో, ఎంఎంటీఎస్ ట్రైన్లు, కాలేజీలకు సంబంధించిన బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుతో ఉచిత ప్రయాణం కల్పించాలని,హైదరాబాద్ నగరం కాస్మోపాలిటిన్ సిటీ అయిపోయింది. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలకు హైదరాబాద్ నగరానికి వస్తుంటారు.టీవీల్లో యాడ్స్, పేపర్లలో ప్రకటనలతో మహిళలకు ఉచిత ప్రయాణమని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోంది.మహిళలకు ఆధార్ కార్డు ప్రామాణికంగా పథకాన్ని అమలు చేస్తుండటంతో నష్టపోతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పుడు, ఆ నిష్పత్తికి అనుగుణంగా బస్సుల సంఖ్యను ఎందుకు పెంచడం లేదు..? ఇదేనా మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీ నీతి, న్యాయం అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న నిర్వాకం ప్రజలకు అర్థమైపోయింది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఖతం పట్టించడం ఖాయమన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన కుంభకోణాల కేసుల్లో విచారణపై విమర్శలు తగవు. అవి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న విచారణలు. మద్యం కుంభకోణం కేసులో కవిత చాలాసార్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తుసంస్థలు రాజ్యాంగబద్ధమైనవి. అంతేకాని, కాంగ్రెస్, బీజేపీ జేబుసంస్థలు కాదన్నారు.

# ప్రజల దృష్టిని మళ్లించి విచ్ఛిన్నకర అజెండాను తీసుకువచ్చే ప్రయత్నంలో బిజెపి

### - కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

**న్యూఢిల్లీ ఏప్రిల్ 8 (వెలుతురు):**
కాంగ్రెస్ మేనిఫెస్టలో ముస్లిం లీగ్ ముద్రలు ఉన్నాయంటూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం తిప్పికొట్టారు. రోజురోజుకూ తన ఎన్నికల విజయావకాశాలు పడిపోతున్న నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ తన మంచి మిత్రుడిని గుర్తు చేసుకోవడం మొదలు పెట్టిందని ఖర్గే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ గత శుక్రవారం విడుదల చేసిన మేనిఫెస్టోపై ముస్లిం లీగ్ ప్రభావం ఉందని ప్రధాని మోడీ ఆరోపించిన నేపథంలో దీనికి ఖర్గే సోమవారం కౌంటర్ ఇచ్చారు.

స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలోని కొన్ని ప్రావిన్సులలో ఉన్న కూటమి ప్రభుత్వాలలో జనంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ భాగస్వామిగా ఉన్నారని ఖర్గే గుర్తు చేశారు. కాగా..ప్రజల దృష్టిని మళ్లించి మళ్లీ విచ్ఛిన్నకర అజెండాను తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా బిజెపి ఈ దాడి మొదలు పెట్టిందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. బిజెపి కుతంత్రాన్ని బయటపెటేందుకు దూకుడుగా వెళ్లాలని పార్టీ నిర్ణయించు కున్నట్లు వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ మేనిఫెస్టోపై తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నా రంటూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాపై ఎక్స్ వేదికగా ఖర్గే మండిపడ్డారు.

దేశంలోని సగటు పౌరుల ఆశయాలు, అవసరాలు, డిమాండ్ల ప్రాతిపదికగా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపకల్పన జరిగిందని ఖర్గే స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో భారతీయులకు వ్యతిరేకంగా



బ్రిటిష్, ముస్లిం లీగ్‌కు మోడీ-షా రాజకీయ, సిద్ధాంతపర పూర్వీకులు మద్దతుపలికారని ఖర్గే విమర్శించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అధ్యక్షతన 1942లో జరిగిన సమావేశంలో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునివ్వగా దీన్ని కూడా మోడీ-షా రాజకీయ, సిద్ధాంతపర పూర్వీకులువ్యతిరేకించారని ఆయన గుర్తు చేశారు. ముస్లిం టీగ్ మద్దతుతో 1940వ దశకలో బెంగాల్, సింధ్, ఎన్‌డబ్లుఎఫ్‌పిలో వ్యామ ప్రసాద ముఖర్జీ ఎలా ప్రభుత్వాలను ఏర్పాటు చేశారో అందిరికీ తెలుసునని ఖర్గే వ్యాఖ్యానించారు.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఎలా అలా ఎదుర్కోవాలో, కాంగ్రెస్‌ను ఎలా అణచివేయాలో వివరిస్తూ అప్పటి బ్రిటిష్ గవర్నర్‌కు శ్యామ ప్రసాద్ ముఖర్జీ లేఖ రాయలేదా అని ప్రధాని మోడీని ఖర్గే ప్రశ్నించారు. ఈ కారణంగానే బ్రిటిష్ పాలకులను భారతీయులు నమ్మవలసి వచ్చిందా లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. మోడీ-షా, బిఝెపి నామినేటెడ్ అధ్యక్షుడు ఇప్పుడు కాంగ్రెస్ మేనిఫెస్టోపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మోడీ ఉపన్యాసాలలో ఆర్ఎస్ఎస్ ఆక్రోశం కనిపిస్తోందని, బిజెపి ఎన్నికల విజయావకాశాలు రోజురోజుకూ పడిపోతున్నాయని, ఈ కారణంగానే ఆర్ఎస్ఎస్ ఇప్పుడు తన మంచి బిత్రుడు ముస్లిం లీగ్‌ను గుర్తు చేసుకుంటోందని ఖర్గే ఆరోపించారు.

# పొగాకు ఉత్పత్తులు,ప్రకటనల నియంత్రణ చట్టం, 2003ను అమలుచేయండి

### గవర్నర్ రాధాకృష్ణన్‌ను కోరిన కౌన్సిల్ ఫర్ పబ్లిక్ హెల్త్ సంస్థ

**తెలంగాణ, ఆగష్టు 8(వెలుతురు):**
తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌తో కౌన్సిల్ ఫర్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ చెరాకుల సమావేశమైనారు. కౌన్సిల్ ఫర్ పబ్లిక్ హెల్త్ సంస్థ యొక్క లక్ష్యాలను వివరించారు. పొగాకు రహిత విద్యా సంస్థల మార్గదర్శకాలను అత్యవసరంగా అమలు చేయడం మరియు పొగాకు ఉత్పత్తులు మరియు ప్రకటనల నియంత్రణ చట్టం, 2003) అమలు కోసం ఆయన గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా గవర్నర్ రాధాకృష్ణన్, ప్రజారోగ్యం కోసం తన అచంచలమైన అంకిత భావంతో, పని చేస్తున్న సంస్థకు ప్రశంసలను అందజేయడమే కాకుండా తన హృదయపూర్వక మద్దతును ప్రకటించారు. విద్యా



అమరికలలో శ్రేయస్సు మరియు చైతన్యానికి ప్రాధాన్యతనిచ్చే సంస్కృతిని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను గూర్చి గవర్నర్ నొక్కి చెప్పారు. డాక్టర్ సర్వప్రియ పాండే మరియు డాక్టర్ దుర్గా ప్రసాద్ ముద్రకోల యువత తమ ఆరోగ్యానికి సంబంధించి అవగాహనతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని కోరారు. ఈ కీలక సమావేశం ప్రజారోగ్యం మరియు మన యువత శ్రేయస్సు పట్ల సమిష్టి నిబద్ధతను స్పష్టం చేసింది.

# తప్పు చేస్తే ప్రశ్నించే అధికారం ప్రజలకు లేదా?

### ఐహెచ్‌అర్‌ఏ ఆంధ్రప్రదేశ్ సివిల్ రైట్స్ చేర్మెన్ కరణం తిరుపతి నాయుడు

**గుంటూరు ఏప్రిల్ 8(వెలుతురు):**
ఏవరైనా తప్పు చేస్తే ప్రశ్నించే అధికారం ప్రతి ఒక్కరికి ఉందని,ఇదిరాజ్యాంగం కల్పించిన హక్కని ఐహెచ్‌అర్‌ఏ ఆంధ్రప్రదేశ్ సివిల్ రైట్స్ చేర్మెన్ కరణం తిరుపతి నాయుడు అన్నారు. తప్పు చేస్తే ఐఏ ఎస్, ఐపీఎస్ అధికారు లను నిలదీయకూడదా? ప్రతిపక్షం. మీడియా ప్రశ్నించకూడదా' అని యన ప్రశ్నించారు. కొద్ది మంది ఐఏ ఎస్, ఐపీఎస్ అధికారులు తప్పుచేస్తే వారి తప్పులను కప్పి పుచ్చుకోడానికి పోలీసు అధికారుల సంఘం తరపున ఎన్నికల సంఘానికి ప్రతిపక్షాలు, మీడియాపై ఫిర్యాదు చేయడాన్ని తిరుపతి నాయుడు తప్పు బట్టారు.'ఎన్నికల సంఘమే 9 మంది ఐఏఎస్, ఐపీఎస్ అది కారులను ఎందుకు బదిలీ చేసిందని ప్రశ్నించారు. పల్నాడు, ప్రకాశం. చిత్తూరు ఎస్పీలు ఏం చేశారో ఎవరికీ తెలియదా? గన్నవరంలో తెదేపా కార్యాలయంపై దాడి చేసినాక్ వైనాన్ని



పోలిసుల వైఫల్యాన్ని ప్రధాని సభలో దేశమంతా చూసారన్నారు.ఏం ఆధారాలు లేకుండా పత్రికలూ వార్తలు రాశాయి? ఏవరైనా ఏ ఆధారాలు లేకుండా పిర్యాదులు చేస్తారా అని ప్రశ్నించారు. చిలకలూరి పేటలో ప్రధాని సభలో జనాన్ని నియంత్రించడంలో పోలీసు అధికారులు విఫలం కాలేదా? సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మైకు ముందుకొచ్చి జనాన్ని నియంత్రించాలేదా? అక్కడున్న ఐపీఎస్ల ఘనత దేశం అంతా చూడలేదా? ప్రధానమంత్రి ప్రసంగానికే ఇబ్బందులు కలిగితే మీ అధికారులు ఏం చేస్తున్నారు? సాక్షాత్తూ ఎస్పీజీ, జడ్ ప్లస్ కేట గిరీ భద్రత ఉన్న ప్రధాని మోదీ, మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు, కిరన్ కుమార్ రెడ్డి తదితరులు వేదికపై ఉన్న సభలో ఎలాంటి చర్యలు తెసుకున్నారని ప్రశ్నించారు.అమరావతి పర్య టనకు వెళ్లిన చంద్రబాబుపై కర్రలు, రాళ్లు విసిరితే మీ డీజీపీ భావప్రకటనా స్వేచ్ఛ అనలేదా? రాజమహేంద్ర వరంలో వరప్రసాద్ పోలీస్ స్టేషన్లోనే శిరోముండనం చేయలేదా? గంజాయి, డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్ నంబర్వన్ అవుతుంటే.. చిత్తూరులో చెక్పోస్టు వద్ద కాపలాగా ఉన్న కానిస్టేబుల్ను ఎర్రచందనం మాఫియా లారీతో ఢీకొట్టి చంపేస్తే మీరేం చేశారు? తీసుకోవాలో మీ డీజీపీకి నిఘా విభాగం అదనపు డైరక్టర్ జనరల్కు తెలియదా? ప్రధాని సభలో భద్రతా వైప ల్యంపై ఎవరూ ప్రశ్నించకూడదా? మీ కమిషనరేట్ పరిధిలోని నందిగామలో తెలుగుదేశం కార్యకర్తలపై వైకాపా ఎమ్మెల్యే జగన్మోహన్, ఎమ్మెల్సీ అరుదు మార్ వారి అనుచరులు ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేసి చంపబోతే సెక్షన్ 307 కింద కేసులు పెట్టకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపలేదా? ఇలాంటి ఐఏఎస్, ఐపీఎస్ అధికా రుల ఆధ్వర్యంలో ఎన్నికలు సజావుగా జరగవనే బయన్దోలన ప్రజల్లో నలకొందని తిరుపతి నాయుడు పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com